


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 27 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 73 పేజీలు : 4 వెల : రూ 3-00


# రైతుల ఖాతాల్లో రూ.2,190 కోట్లు జమ చేసిన సీఎం జగన్





## మూడు పథకాల కింద రైతుల ఖాతాలకు నగదు జమ చేసిన సీఎం జగన్

అమరావతి: వైఎస్సార్ రైతుభరోసా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ యంత్ర సేవాపథకం.. ఈ మూడు పథకాలకు సంబంధించి రూ.2,190 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా రైతులు, రైతు గ్రూపుల ఖాతాల్లో జమ చేశారు. విత్తు నుంచి విక్రయం వరకు రైతు సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకున్న సీఎం వైఎస్ జగన్ మరింత భరోసా కల్పిస్తున్నారు. పంటల సాగు కోసం వైఎస్సార్ రైతుభరోసా పెట్టుబడి సాయం అందిస్తున్న ప్రభుత్వం ఇంకా అవసరమై తీసుకున్న రూ.లక్షలోపు రుణాలను సకాలంలో చెల్లించిన రైతులకు వైఎస్సార్ సున్నావడ్డీ పథకం అమలు చేస్తోంది. సాగు ఖర్చు తగ్గించేందుకు అవసరమైన యంత్రపరికరాలను వైఎస్సార్ యంత్ర సేవాపథకం కింద అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం 40 శాతం సొమ్మును సబ్సిడీగా ఇస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ నగదు జమ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మరో మంచి కార్యక్రమానికి ఈరోజు శ్రీకారం చుట్టామని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేస్తున్నామన్నారు. మాది రైతు పక్షపాత ప్రభుత్వం. మూడో సంవత్సరం రెండో విడత నిధులు విడుదల చేస్తున్నాం. రైతు భరోసా కింద ఇప్పటివరకు రూ.18,777 కోట్లు విడుదల చేశామని" సీఎం పేర్కొన్నారు. "గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రాయితీ బకాయిలు రూ.1,180 కోట్లు ఈ ప్రభుత్వం చెల్లించింది. కరువుసీమలో కూడా నేడు పుష్కలంగా సాగునీరు అందుతోంది. కరోనా సవాల్ విసిరినా కూడా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. రూ.2,134 కోట్ల వ్యయంతో యంత్రసేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. 29 నెలల పాలనలో అనేక మార్పులు తీసుకొచ్చాం. వ్యవసాయ సలహా మండళ్లు ఏర్పాటు చేశాం. ఈ-క్రాపింగ్ నమోదు ద్వారా వ్యవసాయ పథకాలు అమలు చేస్తున్నామని" సీఎం అన్నారు. 50.37 లక్షల మంది రైతులకు వైఎస్సార్ రైతుభరోసాఖరీఫ్ కోతలు, రబీ సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలకు వైఎస్సార్ రైతుభరోసా?పీఎం కిసాన్ కింద రెండోవిడత పెట్టుబడి సాయంగా 50.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,052 కోట్లను జమచేయనున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు తొలివిడతలో దాదాపు 50 లక్షల మంది రైతులకు రూ.7,500 చొప్పున రూ.3,811.96 కోట్లు జమచేసిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కౌలుదారులు, అటవీ భూములు సాగుచేస్తున్న రైతులతో సహా 50.37 లక్షల మందికి రెండోవిడత సాయం అందిస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా?పీఎం కిసాన్ కింద 2019 నుంచి ఏటా మూడువిడతల్లో రూ.13,500 పెట్టుబడి సాయం అందిస్తున్నారు. దీన్లో రూ.7500 మే నెలలోను, రూ.4 వేలు అక్టోబర్‌లోను, మిగిలిన రూ.2 వేలు జనవరిలోను జమ చేస్తున్నారు. భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతోపాటు దేవదాయ, అటవీభూముల సాగుదారులతోపాటు కేంద్రపాలిత ప్రాంతమైన యానాం ప్రాంత రైతులకు రూ.13,500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వమే భరోసా కల్పిస్తోంది. 2019?20లో 45.23 లక్షల మంది కుటుంబాలకు రూ.6,162.45 కోట్ల ఆర్థిక సహాయం అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం 2020?21లో 49.40 లక్షల మంది రైతులకు రూ. 6,750.67 కోట్లు అందజేసింది. అటవీభూమి సాగుచేస్తున్న వారితోపాటు కౌలుదారులు కలిపి తొలి ఏడాది 1,58,123 మంది, రెండో ఏడాది 1,54,171 మంది లబ్ధిపొందారు. 2021?22 సంవత్సరానికి సంబంధించి తొలివిడతగా మే 13న రూ.3,811.96 కోట్ల సాయమందించిన ప్రభుత్వం రెండోవిడతగా నేడు 50.37 లక్షల మంది రైతులకు రూ.2052 కోట్లు అందిస్తోంది. ఈ ఏడాది లబ్ధిపొందుతున్న రైతు కుటుంబాల్లో 48,86,361 మంది భూ యజమానులు కాగా, అటవీభూములు సాగుచేస్తున్న వారు 82,251 మందితోపాటు భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వాస్తవ సాగు(కౌలు)దారులు 68,737 మంది లబ్ధిపొందుతున్నారు. మూడేళ్లుగా లబ్ధి పొందుతున్న వారిసంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ఇస్తున్న రెండోవిడత సాయంతో కలిపి 2019 నుంచి ఇప్పటివరకు వైఎస్సార్ రైతుభరోసా కింద రైతులకు రూ.18,777 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించింది. ఒక్క రైతు కూడా నష్టపోకూడదన్న సంకల్పంతో అర్హుల గుర్తింపులో ప్రభుత్వం అత్యంత పారదర్శకత పాటిస్తోంది. అర్హుల జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఆర్బీకేల్లో ప్రదర్శిస్తూ రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తోంది. అర్హులై ఉండి లబ్ధిపొందని వారి వివరాలను గ్రీవెన్స్ పోర్టల్‌లో పొందుపరిచి వారిలో అర్హులను గుర్తిస్తోంది. కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో నివసిస్తూ మన రాష్ట్రంలో వ్యవసాయ భూములు ఉన్న 865 మంది రైతులకు కూడా ఈ ఏడాది రూ.13,500 వంతున రైతుభరోసా సాయం అందించారు. అప్పుల ఊబిలో చిక్కుకోకుండా రైతులకు వడ్డీలేని రుణాలు ఇస్తామన్న హామీమేరకు వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాల పథకానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. రుణాలను గడువులోగా తిరిగి చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ఇస్తోంది. రూ.లక్షలోపు పంట రుణాలను సకాలంలో తిరిగి చెల్లించిన వారికి వైఎస్సార్ సున్నావడ్డీ కింద రాయితీ ఇస్తూ వారికి అండగా నిలుస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా చెల్లిస్తూ రైతులకు బాసటగా ఉండటమేగాక ఏడాది తిరక్కుండానే ఈ వడ్డీ రాయితీ సొమ్మును జమచేస్తోంది. ఖరీఫ్?2020 సీజన్‌కు సంబంధించి 6.67 లక్షల మంది రైతులకు రూ.112.70 కోట్ల సున్నావడ్డీ రాయితీ సొమ్మును నేడు ముఖ్యమంత్రి వారిఖాతాల్లో జమచేస్తున్నారు.

# 28న ఇండో-ఏసియా శిఖరాగ్ర సదస్సు..



## పాల్గొననున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఈ నెల 28న 18వ ఏసియన్-ఇండియా శిఖరాగ్ర సదస్సు జరుగనుంది. వర్చువల్ విధానంలో జరుగనున్న ఈ సదస్సుకు ప్రధాని నరేంద్రమోదీతోపాటు వివిధ దేశాల అధినేతలు హాజరుకానున్నారు. బ్రూనై సుల్తాన్ ఆహ్వానం మేరకు ప్రధాని ఈ కార్యక్రమానికి వస్తున్నారు. ఇక ఏసియన్-ఇండియా సమ్మిట్‌కు ముందు ఈ నెల 27న జరిగే 16వ తూర్పు ఆసియా దేశాల సదస్సులో కూడా ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఏసియన్-ఇండియా సదస్సులో భారత్, ఆసియా దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తారు. అదేవిధంగా కొవిడ్-19, ఆరోగ్యం, వాణిజ్యం, వ్యాపారం, అనుసంధానం, విద్య, సంస్కృతితోపాటు పలు కీలకరంగాల్లో సాధించిన పురోగతిపై ఈ సమావేశంలో సమీక్షిస్తారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. కరోనా అనంతర ఆర్థిక పురోగతితో సహా ముఖ్యమైన ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై కూడా చర్చించనున్నారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన 17వ ఏసియన్-ఇండియా శిఖరాగ్ర సమావేశానికి కూడా ప్రధాని హాజరయ్యారని, ఈ ఏడాది పాల్గొంటే 9వ సారి ఆయన ఈ సదస్సుల్లో పాల్గొన్నట్లు అవుతుందని విదేశాంగశాఖ వెల్లడించింది.

## బద్వేల్‌లో ప్రజలు ఏకపక్ష తీర్పు ఇస్తారు: ఆదిములపు సురేష్

వైఎస్సార్ జిల్లా: "వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సీఎం జగన్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు బద్వేల్ ఉప ఎన్నికను వేదికగా చేసుకుంటున్నాం. బద్వేల్ ఉపఎన్నికలో ప్రలు ఏకపక్ష తీర్పు ఇస్తారు" అన్నారు మంత్రి ఆదిమూలపు సురేష్. వైఎస్సార్ జిల్లాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "బీజేపీ నేతలు అవాకులు, చవాకులు పేలుతున్నారు. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు" అని మండిపడ్డారు. "బీజేపీ ప్రభుత్వం విభజన చట్టంలో హామీలు అమలు చేసే అవకాశం ఉన్నా చేయడం లేదు. బీజేపీ పరిధిలో లేని హామీలు ఇస్తున్నారు. బద్వేల్‌లో బీజేపీ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తుందట. రాజ్యాంగం ప్రకారం పూర్తిగా స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతాయి. బద్వేలు ఉప ఎన్నికలో ప్రజలు ఏకపక్ష తీర్పు ఇస్తారు" అని మంత్రి సురేష్ ధీమా వ్యక్తం చేశారు.

స్థానిక బీజేపీ నేతలు చెప్పినా రాజీనామా చేస్తా: గడికోట

"నేను ఇసుక వ్యాపారం చేస్తున్నానని సోము వీర్రాజు అంటున్నారు. ఈ ఆరోపణలు నిజమని స్థానిక బీజేపీ నేతలు చెప్పినా రాజీనామా చేస్తా. సోము వీర్రాజు అందుకు సిద్ధమా" అని ప్రశ్నించారు చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి. వైఎస్సార్ జిల్లాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. "విభజన చట్టంలో స్పెషల్ స్టేటస్, పోర్టు వంటి హామీలు అమలు చేస్తే మద్దతు ఇస్తామన్నాం. సోము వీర్రాజు వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారు.

# ఎస్సీ, ఎస్టీ గురుకులాల ఐఐటీ ర్యాంకర్లకు సీఎం జగన్ అభినందన



అమరావతి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన రెసిడెన్షియల్ స్కూళ్ల నుంచి ఐఐటీ సహా ఇతర ఉన్నత విద్యా ప్రవేశాలకోసం పరీక్షలు రాసి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. క్యాంపు కార్యాలయంలో వీరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరినీ పరిచయం చేసుకున్నారు. వారి నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా, వారిని మరింత ప్రోత్సహించేలా మాట్లాడారు. "ఈరోజు ఐఏఎస్‌లుగా ఉన్న చాలామంది నేపథ్యాలు అత్యంత సాధారణమైనవే. మీరుకూడా వారి నుంచి స్ఫూర్తి పొందాలి. కలెక్టర్ల స్థాయికి చేరుకోవాలి. కృషి చేస్తే సాధ్యంకానిది ఏమీ లేదు. సీఎంఓ అధికారి ముత్యాలరాజు జీవితమే దీనికి ఉదాహరణ. ఇప్పటికే మీరంతా ఒక స్థాయికి చేరారు. బాగా కృషిచేసి మంచి స్థానాల్లోకి రావాలి. మీకు ఏం కావాలన్నా తగిన సహాయ సహకారాలు అందుతాయి" అని సీఎం జగన్ తెలిపారు. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాల నుంచి ఇప్పటివరకూ 179 మంది వివిధ ఐఐటీలు, ఐఐటీల్లో ప్రిపరేటరీ కోర్సులు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో సీట్లు సాధించారు. ఎస్టీ విద్యార్థుల్లో 9 మంది ఐఐటీలకు ఎంపికకాగా, 21 మంది ప్రిపరేటరీ కోర్సులకు, 59 మంది ఎన్ఐటీ, ఐఐఐటీ, ఇతర కేంద్ర విద్యాసంస్థలకు ఎంపికయ్యారు. ఎస్సీలనుంచి 13 మంది ఐఐటీలకు, 34 మంది ప్రిపరేటరీ కోర్సులకు, 43 ఎన్ఐటీ, ఐఐఐటీ, కేంద్ర విద్యాసంస్థలకు ఎంపికయ్యారు. ఇంకా కౌన్సిలింగ్ జరుగుతున్నందున మరింతమందికి ర్యాంకులు వచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వీటితోపాటు ఇంకా నీట్, ఇతర వైద్య సంస్థల ఫలితాలు వెల్లడికావాల్సి ఉందని, వీటిలో కూడా ర్యాంకులు సాధిస్తారని అధికారులు వెల్లడించారు.

# నేను జనసేన లో చేరడం లేదు : మాజీ మంత్రి భూమాఅఖిలప్రియ

కర్నూలు, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా భూమా అఖిలప్రియ గురించి మాట్లాడుకుంటున్నారు . అఖిల ప్రియ టీడీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరబోతుందని జరుగుతున్న ప్రచారం హాట్ టాపిక్?గా మారింది. చిరంజీవి కుటుంబానికి భూమా కుటుంబానికి మధ్య మొదటినుంచి



రాజకీయంగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దివంగత భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి దంపతులు చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా శోభానాగిరెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత ప్రజారాజ్యం కనుమరుగవడం భూమా కుటుంబం వైసీపీలో చేరడం ఆ తర్వాత టీడీపీలోకి రావడం జరిగిపోయాయి. ఈ క్రమంలో శోభానాగిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తర్వాత భూమనాగిరెడ్డి గుండెపోటుతో మరణించారు. చిరంజీవి సోదరుడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్?తో కూడా భూమా కుటుంబం సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. దీనికితోడు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్నాయి. దీంతో జనసేనలో చేరితే సులభంగా గెలవచ్చు అని భూమా కుటుంబం ఆలోచిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. భూమా అఖిల ప్రియ జనసేనలో చేరబోతున్నారు అంటూ పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతోన్నాయి. ప్రస్తుతం అఖిల ప్రియ గర్భవతిగా ఉండటంతో ఆమె సోదరుడు జగత్ విఖ్యాత్ రెడ్డి రాజకీయంలో యాక్టివ్?గా ఉన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారంపై భూమా అఖిలప్రియ స్పందించారు.

# ఢిల్లీ వీధుల్లో దిగజారుడు రాజకీయాలు:మంత్రి కన్నబాబు





తాడేపల్లి అక్టోబర్ 26 కేవలం తన రాజకీయాల కోసం ఢిల్లీ వీధుల్లో రాష్ట్ర ప్రజల ఖ్యాతిని చంద్రబాబు తగ్గిస్తున్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు ఉన్నట్లు ఢిల్లీ వీధుల్లో చెప్తున్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారం వల్ల ఇతర రాష్ట్రాలు ఏమనుకుంటాయి. మీరు తిట్టిన తిట్లు వాళ్లకి గుర్తు ఉండవా..?. అని మంత్రి కన్నబాబు ప్రశ్నించారు. వైఎస్సార్ రైతు భరోసా, సున్నావడ్డీ, వైఎస్సార్ యంత్ర సేవా పథకాలను మంగళవారం సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కన్నబాబు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో పంట రుణ మాఫీ కింద రూ.12,500 కోట్లు ఇస్తే ఈ రెండున్నరేళ్లలో 18,777 కోట్లు ఇచ్చాం. మేనిఫెస్టోలో రైతు కోసం ఇచ్చిన హామీలు నూటికి నూరు శాతం అమలు చేస్తున్నారు. రాష్ట్రపతి రాజధాని గురించి అడిగితే నాశనం చేశారని చెప్పారట. పదేళ్ల హక్కును వదిలేసి ఇక్కడికి పారిపోయి వచ్చి మేమేదో నాశనం చేశామని చెప్పారట. మీ రియల్ ఎస్టేట్ అవసరాల కోసం మూడు రాజధానులు అడ్డుకుని మాపై నిందలా?. దిగజారుడు రాజకీయాలు చేసి ఢిల్లీ వీధుల్లో డ్రామాలు చేస్తున్నారా?. పార్టీ బతికుందని చెప్పుకునే ప్రయత్నం కాదా?. పుస్తకాల్లో పేర్లు రాసుకోవడం కాదు మా కార్యకర్తపై చెయ్యి వేసి చూడండి. ఈ డ్రామాలన్నీ మోదీ, అమిత్ షాలకు తెలుసు. వాళ్లకి ఇక్కడి వాస్తవ పరిస్థితులు తెలియవా? ఆయన మాట్లాడిన మాటలు వాళ్లకు తెలియదా..?. తప్పకుండా ఎన్నికల కమిషన్‌కు పిర్యాదు చేస్తాం. ఎప్పుడు 356 పెట్టాలో వాళ్ళకి తెలియదా?. చంద్రబాబుకి ముందు నిబద్ధత, క్రమశిక్షణ, కట్టుబాటు లేదు అంటూ మంత్రి కురసాల కన్నబాబు ఫైర్ అయ్యారు. ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే రైతుకు పెట్టుబడి సాయంగా నగదు ఇవ్వడం ఇక్కడే జరిగింది. అక్టోబర్ నెల రైతుకు చాలా కీలకం.

# 'కావాలంటే ఏపీలో పార్టీ పెట్టుకోవచ్చు మాకెలాంటి అభ్యంతరాలు లేవు

## కెసిఆర్ వ్యాఖ్యలపై ఏపీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్

అమరావతి అక్టోబర్ 26 ఈ నెల 25 న నిర్వహించిన 20 ఏళ్ల పార్టీ ప్లీనరీ సందర్భంగా ఏపీలో టీఆర్ఎస్ పార్టీని పెట్టాలని ఏపీ ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తున్నాయని.. పార్టీ పెడితే చాలు.. గెలిపిస్తామన్న విన్నపాలు వస్తున్నట్లుముఖ్యమంత్రి కెసిఆర్ వెల్లడించారు. ఏపీలో కరెంటు కోతులు ఉన్నాయి. తెలంగాణలో సంక్షేమ పథకాలు బాగా అమలవుతున్నాయి.. ఏపీలోనూ టీఆర్ఎస్



పార్టీ రావాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ వ్యాఖ్యలపై ఏపీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ స్పందించారు. కేసీఆర్ చెప్పినట్లుగా.. ఏపీలో కరెంటు కోతలు లేవని.. బొగ్గు సమస్య ఏపీకి మాత్రమే పరిమితం కాలేదని. దేశ వ్యాప్తంగా ఈ సమస్య ఉందన్నారు. తెలంగాణతో పోలిస్తే.. ఏపీలోనే సంక్షేమ పథకాలు ఎక్కువగా అమలవుతున్నాయన్నారు. ఉప ఎన్నికల స్టంట్ లో భాగంగానే తెలంగాణ సీఎం కేసీఆర్ అలా ప్లీనరీలో మాట్లాడి ఉండొచ్చన్న అభిప్రాయాన్ని మంత్రి అనిల్ వ్యక్తం చేశారు. తెలంగాణలో అమల్లో ఉన్న పథకాల కంటే కూడా ఏపీలోనే ఎక్కువ పథకాలు అమల్లో ఉన్నాయని చెప్పారు. ఇటీవల కాలంలో సీఎం కేసీఆర్ నోటి నుంచి అదే పనిగా ప్రస్తావిస్తున్న దళితబంధు పథకం మీదా మంత్రి అనిల్ మాట్లాడారు. దళితబంధు పథకాన్ని తెలంగాణలో ఇప్పటివరకు ఒకే ఒక్క నియోజకవర్గంలో అమలు చేశారని.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయలేదన్నారు. ఏపీలో తమ పార్టీని ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ మాటకు స్పందిస్తూ.. 'కావాలంటే ఏపీలో పార్టీ పెట్టుకోవచ్చు. పార్టీ పెట్టుకోవటాన్ని స్వాగతిస్తున్నాం.

# సంపాదకీయం

బుధవారం 27 అక్టోబరు 2021

## కరోనా థర్డ్ వేవ్

చైనాలోని అనేక ప్రాంతాల్లో, డెల్టా వేరియంట్‌కు చెందిన కరోనా వైరస్ వ్యాప్తి నిరంతరం పెరుగుతోంది. చైనా వాయువ్య ప్రాంతంలోని ఇన్నర్ మంగోలియాలోని ఐజిన్ కౌంటీలో పూర్తి లాక్ డౌన్ విధించారు. సోమవారం నుండి ప్రజలను ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం కోరింది. ఐజిన్ జనాభా 35,700. వారు కోవిడ్ ఆంక్షలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రస్తుతం, ఏజిన్ కరోనా హాట్‌స్పాట్‌గా ఉంది. గత వారం ఇక్కడ 150 మందికి పైగా కొత్త సోకినవారిని కనుగొన్నారు. చైనా జాతీయ ఆరోగ్య కమిషన్ సుమారు ఒక వారంలో, కోవిడ్ సంక్రమణ 11 రాష్ట్రాలకు వ్యాపించిందని హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దిగజారనుంది. ఈ హెచ్చరిక తరువాత, ఏజిన్‌లో లాక్‌డౌన్‌ప్రకటించారు. చైనాలో సోమవారం 38 కరోనా కేసులు వెలుగులోకి వచ్చాయి. వాటిలో సగం ఇన్నర్ మంగోలియా నుండి వచ్చాయి. కరోనా వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో చైనా రాజధాని బీజింగ్ లో ఆంక్షలు తీవ్రతరం చేశారు. ఇప్పటికే బీజింగ్ లో కరోనా పాజిటివ్ కేసులు 12కి పెరిగాయి. దీంతో దేశంలోని కరోనా ఇన్ఫెక్షన్ కొనసాగుతున్న ప్రాంతాల్లో, అక్కడి ప్రజలు బీజింగ్‌కు రావాలంటే కొన్ని షరతులు పాటించాలని సూచించింది. కోవిడ్ పరీక్ష నివేదికను చూపించినప్పుడే వారికి రాజధానిలో ప్రవేశం లభిస్తుంది. ఈ నివేదిక 2 రోజుల కంటే పాతదిగా ఉండకూడదు. అలాగే, వారి ఆరోగ్యాన్ని 2 వారాల పాటు పర్యవేక్షిస్తారు. పెరుగుతున్న ఇన్ఫెక్షన్ దృష్ట్యా, అధికారులు బీజింగ్‌లో దర్యాప్తును పెంచడం అదేవిధంగా హోటల్‌లో బుకింగ్‌ను నిషేధించడం వంటి చర్యలు తీసుకున్నారు. బీజింగ్, ఇన్నర్ మంగోలియా, గాన్సు, నింగ్జియా మరియు గుయిజౌలలో కోవిడ్ ఇన్ఫెక్షన్ పెరుగుదలఉంది. ఈ రాష్ట్రాలలో దేశంలోని ఇతర ప్రాంతాల నుండి ప్రయాణాన్ని నిషేధించారు. దీనితో పాటు, రైళ్ల రాకపోకలను కూడా నిషేధించారు. పెరుగుతున్న సంక్రమణ దృష్ట్యా, పరిపాలన చాలా అప్రమత్తంగా ఉంది. వీలైనంత త్వరగా ఇన్ఫెక్షన్ పెరగకుండా నిరోధించడమే ప్రభుత్వ ప్రయత్నం. సంక్రమణ కేసులు పెరగడం వెనుక కారణం షాంఘైలో నివసిస్తున్న ఒక వృద్ధ జంట, జియాన్‌తో సహా అనేక నగరాలకు వెళ్లి కోవిడ్ -19 తో బాధపడుతున్నట్లు గుర్తించారు. దీని తరువాత, ఆ జంటతో పరిచయమైన వ్యక్తులను గుర్తించడానికి అధికారులు పని ప్రారంభించారు. మూడు రోజుల్లో అతనితో సన్నిహితంగా ఉన్న వందలాది మంది వ్యక్తులను కనుగొనగా, వారితో ప్రయాణించిన 5 మందికి కూడా తరువాత వ్యాధి సోకినట్లు తేలింది. మరో వైపు రష్యాలో కరోనా కేసులు, మరణాలు అగడం లేదు.. గడిచిన 24గంటల్లో అక్కడ.. 39,930 కొత్త కేసులు నమోదు కాగా 1069మంది మరణించారు. ఆ దేశంలో కరోనా మొదలైనప్పటి నుంచి ఇన్ని కేసులు రావడం ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఇటీవల1075 మంది ఒక్కరోజులో ప్రాణాలు కోల్పోయారు. తాజా కేసులతో కలిపి రష్యాలో ఇప్పటివరకు కరోనా కేసుల సంఖ్య 8.2మిలియన్లకు చేరగా, 2,31,669మంది ప్రాణాలను కోల్పోయారు. ఇక అత్యధిక మరణాలు సంభవించిన దేశాలలో ఐదో స్థానంలో రష్యా ఉంది. వ్యాక్సినేషన్ రేటు తక్కువగా ఉండటం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే దీనికి కారణమని నిపుణులు అంటున్నారు. అటు దేశంలో కరోనాని అదుపు చేసేందుకు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్నారు. వారం రోజుల పాటు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని నిర్ణయించారు. దీనితో ఈ నెల 30 నుంచి నవంబర్ 7వరకు సెలవులు ప్రకటించారు. గురువారం నుంచి ప్రారంభించే యోచనలో ఉన్నారు. పాఠశాలలు, జిమ్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్ వేదికలతో పాటు అనేక స్టోర్లను 11 రోజుల పాటు మూసివేయనున్నారు. రెస్టారెంట్లు, కేఫ్‌లకు మాత్రం డెలివరీలకు మాత్రం అనుమతించనున్నారు. ఫుడ్ స్టోర్లు, ఫార్మసీలు మాత్రం తెరిచిఉంచేందుకు అనుమతించనున్నారు

# నిర్మాణ రంగంపై పెట్రో ప్రభావం



విజయవాడ, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)పెద్ద నోట్ల రద్దు, ఆర్థిక సంక్షోభం, కోవిడ్ వంటి వరుస దెబ్బలను తట్టుకుని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న నిర్మాణ రంగాన్ని డీజిల్ ధరలు, బొగ్గు కొరత మరోసారి తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఏడాదిన్నరలో లీటర్ డీజిల్ ధర ఏకంగా రూ.28 పెరగడంతో రవాణా వ్యయం భారీగా పెరిగింది. ఏడాదిన్నర కిందట లీటర్ డీజిల్ ధర రూ.78గా ఉండగా ఇప్పుడు అది రూ.106 దాటింది. అదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా బొగ్గు కొరత రావడంతో డిమాండ్ లేకున్నా ఉత్పత్తి తగ్గడం వల్ల స్టీల్, సిమెంట్, అల్యూమినియం, కాపర్, ప్లాస్టిక్ వంటి అన్ని రకాల ఉత్పత్తుల ధరలు 40 నుంచి 50 శాతం వరకూ పెరిగాయని బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు కొరత ప్రభావం అధికంగా స్టీల్ రంగంపై పడింది. కొరత లేకముందు టన్ను స్టీల్ ధర రూ.40?45 వేల మధ్య ఉంటే.. ఇప్పుడది ఏకంగా రూ.65,000 మార్కును అధిగమించింది. సిమెంట్ బస్తా రూ.260 నుంచి రూ.370కి చేరింది. డీజిల్ ధరలు పెరగడంతో ఇసుక, కంకర, ఇటుక వంటి వస్తువుల రవాణా వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిందని ఏపీ క్రెడాయ్ ప్రెసిడెంట్ రాజాశ్రీనివాస్ చెప్పారు. ముడి సరుకుల వ్యయం భారీగా పెరగడంతో చదరపు అడుగు నిర్మాణ వ్యయం 20 శాతం వరకూ పెరుగుతోందన్నారు. దీంతో నూతన ప్రాజెక్టులు చేపట్టేందుకు బిల్డర్లు వెనుకాడుతున్నారు. ఇప్పటికే మొదలు పెట్టినవారు పని వేగాన్ని తగ్గించినట్టు క్రెడాయ్ వర్గాలు చెబుతున్నాయి. నిర్మాణ వ్యయం పెరిగినా ధరలు పెంచలేని పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ రంగం ఉందని ఏపీ క్రెడాయ్ ప్రెసిడెంట్ రాజా శ్రీనివాస్ చెప్పారు. వడ్డీరేట్లు తక్కువగా ఉండటంతో ఇప్పుడిప్పుడే అమ్మకాలు పుంజుకుంటున్నాయన్న తరుణంలో నిర్మాణ వ్యయం ఒక్కసారిగా పెరిగిపోయిందని, దీంతో నూతన ప్రాజెక్టుల కంటే.. ఇప్పటికే నిర్మించిన వాటిని అమ్ముకోవడం పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. కొత్త వెంచర్లు వేసేందుకు కూడా బిల్డర్లు వెనుకాడుతున్నారని వైజాగ్ క్రెడాయ్ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. క్రెడాయ్ అంచనాల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో 1.4 లక్షల ఫ్లాట్స్ నిర్మాణంలో ఉండగా, వాటిలో 56,000 ఫ్లాట్స్ గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయి. లక్షలాది మందికి ఉపాధి కల్పించే నిర్మాణ రంగాన్ని వరుస సంక్షోభాలు వెంటాడుతున్నాయని క్రెడాయ్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 6నెలల్లో 73 కోట్ల మందులు

గుంటూరు, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో గత ఆర్నెల్లుగా జ్వరానికి వాడే పారాసెటిమాల్ అత్యధికంగా వినియోగించినట్లు వైద్య ఆరోగ్యశాఖ, ఏపీఎంఎస్ఐడీసీ పరిశీలనలో వెల్లడైంది. కోవిడ్ నేపథ్యంలో చిన్నపాటి జ్వరం సూచనలు ఉన్నా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పారాసెటిమాల్ తీసుకుంటున్నారు. గత ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకూ రాష్ట్రంలో 8,13,44,410 మాత్రలను వినియోగించారు. రోజుకు సగటున 4.51 లక్షల మాత్రలకు పైగా వినియోగం నమోదైంది. కోవిడ్‌కు ముందు అంటే 2020 కంటే ముందు పోలిస్తే ఈ వినియోగం చాలా ఎక్కువగా ఉన్నట్టు అధికారుల పరిశీలనలో తేలింది. చాలామంది తాత్కాలిక ఉపశమనం కోసం నొప్పి నివారణ మందులకు అలవాటు పడినట్టు గుర్తించారు. ఆరు నెలల్లో 6.63 కోట్ల డైక్లోఫినాక్ మాత్రలు వాడారంటే పెయిన్‌కిల్లర్స్ వినియోగం ఎలా ఉందో అంచనా వేయచ్చు. ఏదైనా గాయాలైనప్పుడు, ఆపరేషన్లు, విపరీతమైన నొప్పి తగ్గగానే ఆపాలి. కానీ చాలామంది చిన్న తలనొప్పి, ఒళ్లు నొప్పులకు కూడా పెయిన్ కిల్లర్స్‌కు అలవాటు పడ్డారు. ఇవి ఎక్కువగా వాడటం వల్ల మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఒక్కసారి మధుమేహం వస్తే జీవితాంతం మందులు వాడాల్సిందే. కొత్తగా బాధితుల సంఖ్య పెరుగుతోంది. గత 180 రోజుల్లో 6.44 కోట్ల మెట్‌ఫార్మిన్ మాత్రలు వినియోగమయ్యాయి. రక్తపోటు (బీపీ) బాధితులకు ఇచ్చే అటెన్‌లాల్ మాత్రలు 3.76 కోట్లు వినియోగమయ్యాయి. బీపీ, షుగర్ చాపకింద నీరులా విస్తరిస్తున్నాయని, వ్యాయామం, ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సమయానికి తినకపోవడం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం లాంటి కారణాలతో గ్యాస్ సమస్యలు తలెత్తి 3.24 కోట్ల ర్యాంటిడిన్ మాత్రలు వినియోగించారు. గత ఆర్నెల్లలో రకరకాల మాత్రలకు రూ.73 కోట్లు వెచ్చించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక డబ్ల్యూహెచ్‌వో/జీఎంపీ (గుడ్ మాన్యుఫాక్చరింగ్ స్టాండర్డ్స్) ప్రమాణాలను అనుసరించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో 510 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. ఇందులో 481 రకాల మందులు ఏదో ఒక సందర్భంలో వినియోగించినట్టు తేలింది. కోవిడ్ సమయంలో ఎక్కడా మందుల కొరత లేకుండా సర్కారు పటిష్ట చర్యలు చేపట్టగలిగిందని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు.

# కాసులు కురిపిస్తున్న అక్వా



తిరుపతి, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)సింహపురిలో 1990వ దశకంలో టైగర్ రొయ్యలు నీలి విప్లవం సృష్టించాయి. దాదాపు దశా బ్దానికి పైగా డాలర్లు, యూరోలు ఆర్జించి పెట్టింది. తొలిదశలో రైతులను కోటీశ్వరులను తయారు చేసింది. కొన్నేళ్లలో వైరస్‌లు చుట్టుముట్టడంతో ఎంతో మంది రైతులను బికారీలను చేసింది. ఆ తర్వాత కొత్త రకం వెనామీ రావడంతో ఆక్వా సాగుదారులు అటు వైపు మళ్లారు. 2003 నుంచి 2015 వరకు వెనామీ సాగు డాలర్ల వర్షం కురిపించింది. వెనామీని సైతం పలు రకాల వైరస్‌లు వెంటాడుతుండడంతో దిగుబడులు తగ్గుతూ వచ్చాయి. వైరస్‌లకు యాంటీబయోటిక్స్ వాడడంతో ఎగుమతులు సన్నగిల్లాయి. నాసిరకం సీడ్ కారణంగా 120 రోజులు దాటినా కనీసం 100 కౌంట్ కూడా రాని పరిస్థితితో పెట్టుబడులు రాక అప్పులపాలవుతున్నారు. గూడూరు నియోజకవర్గంలో చిల్లకూరు, కోట, వాకాడు, చిట ?టమూరు మండలాల్లో సుమారు 2,500 హెక్టార్లలో సాగు చేసిన రైతులు ప్రస్తుతం 500 హెక్టార్లలో కూడా సాగు చేయలేక చతికిలపడ్డారు. ఆంధ్రప్రదేశ్ నుంచే ఏటా 6.34 లక్షల టన్నుల (74 శాతం) రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో సింహపురిదే సింహభాగం వెనామీ రొయ్యలదే. అంతకు ముందు నాటు రొయ్య (టైగర్) హవా నడిచింది. ఆ తర్వాత టైగర్ రొయ్యలకు వైట్ స్పాట్ (తెల్లమచ్చ) వైరస్, ఇతరత్రా వ్యాధులు సోకడం, వ్యాధి రహిత తల్లి రొయ్యల ఉత్పత్తి లేకపోవడంతో "టైగర్' శకం ముగిసింది. అదే సమయంలో విదేశాల నుంచి స్పెసిఫిక్ పాత్ జోన్ ఫ్రీ (ఎస్‌పీఎఫ్) వెనామీ బ్రూడర్స్ (తల్లి రొయ్యలు) రావడం, విస్తృత స్థాయిలో సీడ్ అందుబాటులోకి రావడంతో ఆక్వా రంగం పూర్తిగా వెనామీ వైపు మళ్లింది. ప్రస్తుతం వెనామీ రొయ్యలకు సైతం వైట్ స్పాట్, వెబ్రియా తదితర వైరస్‌లు, వ్యాధుల కారణంగా 40 కౌంట్‌లో పట్టాల్సిన 80?100 కౌంట్‌లో పట్టేయాల్సి వస్తోంది. దీంతో వెనామీ సాగు చేస్తున్న రొయ్యల రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తిరిగి టైగర్ రొయ్యలు అందుబాటులోకి వస్తున్నాయి. అమెరికాలోని హవాయికి చెందిన ఓ సంస్థ ఎస్‌పీఎఫ్ టైగర్ తల్లి రొయ్యలను అభివృద్ధి పర్చడంతో తిరిగి టైగర్ శకం ప్రారంభమైంది. వాటి దిగుమతికి 2019లో కేంద్రం అనుమతి ఇవ్వడంతో దేశీయ అవసరాలకు సరిపడా బ్రూడర్స్ దిగుమతికి అవకాశాలు తక్కువగా ఉండడంతో తల్లి రొయ్యల పునరుత్పత్తి కోసం గుజరాత్‌లో బ్రూడర్ మల్టిప్లికేషన్ సెంటర్ (బీఎంసీ)ను ఆ ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసింది. తల్లి రొయ్యల నుంచి ఉత్పత్తయ్యే సీడ్‌ను ఇక్కడ 4 నెలల పాటు పెంచి తద్వారా తల్లి రొయ్యలను పునరుత్పత్తి చేస్తోంది. వైట్‌స్పాట్‌తో పాటు ఇతర వ్యాధులను సైతం తట్టుకునేలా వాటిని అభివృద్ధి చేస్తారు. ఆ ప్రైవేట్ సంస్థ టైగర్ బ్రూడర్స్‌ను దిగుమతి చేసుకుని నెల్లూరు జిల్లాలోని వాకాడులో హేచరీ ద్వారా సీడ్ (రొయ్య పిల్లల)ను ఉత్పత్తి చేసింది. చిల్లకూరు మండలంలో కొంత మంది రైతులను ఎంపిక చేసుకుని వారికి సీడ్‌ను సరఫరా చేసి సుమారుగా 500 ఎకరాల వరకు తొలిసారిగా సాగు చేపట్టారు. 120 రోజుల క్రితం పిల్ల రొయ్యను వదలిన తర్వాత ఎలాంటి వైరస్‌లు సోకకుండా మేత సకాలం వేస్తుండడంతో అనుకున్న ఫలితం కన్నా రెట్టింపు దిగుబడి రావడంతో బ్లాక్ టైగర్ ఈ ప్రాంతంలో బాగా లాభాలు ఆర్జించి పెడుతుందన్న నమ్మకం ఏర్పడింది. తాజాగా అందుబాటులోకి వచ్చిన బ్లాక్ టైగర్ రొయ్యల సాగుకు ఎకరాకు లక్ష పిల్లలు మాత్రమే వదలితే సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. ఇవి 120 రోజుల్లో 15 కౌంట్ వస్తుండడంతో పాటు లాభాలు బాగా వస్తుండడంతో రైతులు పూర్తిగా టైగర్ సాగు వైపు మొగ్గు చూపేందుకు సిద్ధమవుతున్నారు. ఎకరాకు టన్ను నుంచి టన్నున్నర దిగుబడి లభిస్తోంది. ప్రస్తుతం ఒక్కో రొయ్య పిల్ల రూపాయికి అందుబాటులో ఉంది.

# భూమాన కు చివరి ఛాన్సేనా



తిరుపతి, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)ఇప్పుడు మంత్రి వర్గ సమావేశంలో ఎవరికి పదవి దక్కుతుందా? అన్న టెన్షన్ ఒకవైపు ఉండగా, మరోవైపు ఈసారి ఎన్నికల్లో టిక్కెట్లు గల్లంతయ్యే వారిపై కూడా చర్చ జరుగుతోంది. అందులో భూమన కరుణాకర్ రెడ్డి ఒకరు. ఈసారి భూమన ను పక్కన పెట్టే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు ఆయన సీటుకు ఎసరు పెట్టేలా కన్పిస్తున్నాయి. అయితే గత ఎన్నికల్లోనే ఇవే తన చివరి ఎన్నికలు అని భూమన ఎప్పుడో చెప్పారు. అయితే భూమన కరుణాకర్ రెడ్డి తన వారసుడిని ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావించారు. కానీ జగన్ మాత్రం ఇందుకు నో చెప్పినట్లు తెలిసింది. ఇందుకు తిరుపతిలో ఉన్న ప్రత్యేక కారణాలేనని చెబుతున్నారు. ఏపీలో కాపు, కమ్మ ఈక్వేషన్లతో టీడీపీ, జనసేన ఎన్నికల బరిలోకి దిగే అవకాశముంది. అందుకే తిరుపతి నియోజకవర్గంలో కాపు సామాజికవర్గం నేతనే ఈసారి ఎన్నికల బరిలోకి జగన్ దించే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని ఇప్పటికే భూమన కరుణాకర్ రెడ్డికి స్పష్టం చేసినట్లు తెలిసింది. తిరుపతిలో బలిజ సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అక్కడ వారే గెలుపోటములను నిర్ణయిస్తారు. మెగాస్టార్ చిరంజీవి, చదలవాడ కృష్ణమూర్తి, వెంకటరమణ, సుగుణ వీరంతా తిరుపతి నుంచి గెలిచిన కాపు సామాజికవర్గం చెందిన వారే. భూమన కరుణాకరెడ్డి, ఎన్టీ రామారావు వంటి వారు కూడా ఇక్కడ నుంచి గెలిచారుఅయితే ఈసారి టీడీపీ, జనసేన కలుస్తుండటంతో ఇక్కడ కాపు సామాజికవర్గానికి చెందని అభ్యర్థి అయితే బాగుంటుందని జగన్ డిసైడ్ అయ్యారు. గత ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి పై భూమన కరుణాకర్ రెడ్డి 700 ఓట్ల తేడాతో మాత్రమే గెలిచారు. అందుకే ఈసారి ఆ రిస్క్ తీసుకోదలచుకోలేదంటున్నారు.

# బీజేపీతో కలసొచ్చేనా

విజయవాడ, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)ఏపీ పంచాయితీ ఢిల్లీకి చేరనుంది. గత వారం రోజుల నుంచి ఏపీలో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయో చెప్పాల్సిన పని లేదు. టీడీపీ నేత పట్టాభి?సీఎం జగన్‌ని తిట్టడం?దానికి బదులుగా వైసీపీ శ్రేణులు టీడీపీ ఆఫీసులపై దాడులు చేయడం?దానికి నిరసనగా చంద్రబాబు 36 గంటల దీక్ష చేయడం?అటు జగన్‌ని తిట్టినందుకు వైసీపీ ప్రజాగ్రహ దీక్షలు చేశారు. ఇలా రెండు పార్టీల మధ్య రచ్చ నడుస్తూనే ఉంది. అయితే ఏపీలో వైసీపీ అరాచక పాలన సాగిస్తుందని, పార్టీ ఆఫీసులపై దాడితో శాంతిభద్రతలు లేవని తేలిపోయిందని చెబుతూ?ఆర్టికల్ 356 ఉపయోగించి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని చంద్రబాబు ఢిల్లీ వెళ్ళి రాష్ట్రపతిని కోరనున్నారు. ఇప్పటికే రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ బాబుకు దొరికింది?అదే సమయంలో ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్ కోసం బాబు ట్రై చేస్తున్నారు. వారిని కలిసి రాష్ట్రపతి పాలన, జరిగిన దాడులపై సిబిఐ ఎంక్వైరీ వేయాలని కోరనున్నారు. అయితే బాబు ఈ రెండిటి కోసమే ఢిల్లీకి వెళుతున్నారా? లేక బీజేపీకి దగ్గరవ్వడానికి వెళుతున్నారా? అనేది క్లారిటీ లేకుండా ఉంది. రాజకీయంగా చూస్తే మళ్ళీ బీజేపీ పెద్దలకు దగ్గరయ్యి, వారి మద్ధతు కూడబెట్టుకుని ఏపీలో జగన్‌కు చెక్ పెట్టాలనేది చంద్రబాబు ఆలోచన అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీతో కలిసి అధికారంలోకి వచ్చారు?.కానీ తర్వాత బీజేపీతో విభేదించి బయటకొచ్చి బాగా హడావిడి చేశారు. బీజేపీ నుంచి బయటకొచ్చాక బాబు పరిస్తితి ఏమైందో చెప్పాల్సిన పని లేదు. 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడారు..ఆ తర్వాత రాజకీయంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. అదే బీజేపీ సపోర్ట్ ఉండుంటే బాబు పరిస్తితి వేరేగా ఉండేదని విశ్లేషకులు అంటున్నారు. అందుకే మళ్ళీ ఇప్పుడు బీజేపీకి దగ్గరయ్యేందుకు బాబు ప్రయత్నిస్తున్నట్లు కనబడుతోందని, అందుకే ఢిల్లీ పర్యటన అని అంటున్నారు. మరి చూడాలి బీజేపీ?బాబుని కనికరిస్తుందో లేదో?

# పార్టీ రద్దు చేసేస్తారా

గుంటూరు, అక్టోబరు 36, (న్యూస్ పల్స్) ఏపీ రాజకీయాలు బాగా రసవత్తరంగా నడుస్తున్నాయి?అటు అధికార వైసీపీ, ఇటు ప్రతిపక్ష టిడిపిల మధ్య వార్ మామూలుగా లేదు. తిట్టుకోవడమే కాదు?ఆఖరికి కొట్టుకోవడం వరకు ఏపీ రాజకీయాలు వెళ్లిపోయాయి. ఈ క్రమంలోనే ఎవరికి వారు ప్రత్యేక డిమాండ్లతో రాజకీయం మొదలుపెట్టారు. అసలు టిడిపి ఆఫీసులపై వైసీపీ శ్రేణులు దాడి చేయడంపై చంద్రబాబు, రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, ఇక రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తున్నారు. అటు జరిగిన ఘటనలపై సిబిఐ విచారణ చేయాలని అంటున్నారు. అయితే ఎలాంటి వాటికి రాష్ట్రపతి పాలన విధిస్తారో బాబుకు తెలియనిది కాదు?.కానీ ఆయన అలా మాట్లాడటం వెనుక రాజకీయ కోణం ఉందనే చెప్పాలి. పైగా ఢిల్లీ స్థాయిలో రాష్ట్రంలో ఇలాంటి పరిస్తితులు ఉన్నాయని వైసీపీని నెగిటివ్ చేయాలని చూస్తున్నారు. కానీ బాబు డిమాండ్ చేస్తున్నట్లు రాష్ట్రపతి పాలన పెట్టడం జరిగే పని కాదు. అటు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సిఎంని దూషించడంపై వైసీపీ నేతలు కూడా?టిడిపిని నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణలు ఈ రకమైన డిమాండ్లు చేస్తున్నారు. అలాగే వైసీపీ?కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది. టిడిపి నేతల మాట్లాడిన బూతుల వీడియో క్లిప్పులని కూడా ఇవ్వనుంది. మరి వీటిని చూసి?ఎన్నికల సంఘం టిడిపి గుర్తింపుని రద్దు చేసేస్తుందా? అంటే అది కూడా సాధ్యమయ్యే పని కాదు. వైసీపీ కూడా కేంద్ర స్థాయిలో టిడిపిని దెబ్బకొట్టడానికి ఈ ఎత్తుగడని ఎంచుకుంది. అలా అంటే వైసీపీ నేతలు?ఎన్నిసార్లు ఎన్నిరకాలుగా చంద్రబాబుని, పవన్ కల్యాణ్‌ని బూతులు తిట్టారో చెప్పాల్సిన పని లేదు. ఇక ఆ వీడియోలు పట్టుకుని వైసీపీని నిషేధించాలని టిడిపి-జనసేనలు ఫిర్యాదు చేస్తే?అప్పుడు రివర్స్ అయిపోతుంది. అసలు టిడిపి-వైసీపీలు చేసే డిమాండ్లు ఏ మాత్రం వర్కౌట్ కావనే చెప్పాలి. కేవలం రాజకీయం కోసమే రెండు పార్టీలు వేస్తున్న ఎత్తులు.

# అనంతలో ఒంటరేనా

అనంతపురం, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)సీనియర్ నేత జేసీ దివాకర్ రెడ్డికి తెలుగుదేశం పార్టీలో ఎక్కడకక్కడ చెక్ పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయన వర్గీయులందరినీ కట్టడి చేయాలనే నిర్ణయానికి పార్టీ అధినాయకత్వం వచ్చింది. పార్టీలో గ్రూపులను ప్రోత్సహిస్తున్న జేసీ దివాకర్ రెడ్డి బ్రదర్స్ ను ఇప్పుడే కంట్రోల్ చేయలేకపోతే భవిష?యత్ లో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని చంద్రబాబు సయితం అంతర్గత సమావేశాల్లో అంగీకరిస్తున్నారు. జేసీ దివాకర్ రెడ్డి వర్గం తమ పార్లమెంటు నియోజకవర్గంలో పట్టు పెంచుకునే ప్రయత్నాలు చేస్తుంది. ఇందులో భాగంగా శింగనమల నియోజకవర్గంలో తమ వర్గానికి చెందిన బండారు శ్రావణికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. కానీ స్థానిక నాయకత్వం బండారు శ్రావణిని వ్యతిరేకిస్తుంది. దీంతో చంద్రబాబు ఇక్కడ టూ మెన్ కమిటీని నియమించారు. టూ మెన్ కమిటీ పర్యటించి స్థానిక నేతల అభిప్రాయాలను సేకరిస్తుంది. 2019 ఎన్నికల్లో బండారు శ్రావణి ఇక్కడి నుంచి పోట ?చేసి ఓటమి పాలయ్యారు. ఈమె జేసీ వర్గీయురాలు. రిజర్వ్ డ్ నియోజకవర్గం కావడంతో నాటి ఎన్నికల ఖర్చంతా జేసీ బ్రదర్స్ భరించారు. అయితే ఇప్పుడు ఆమెకు వ్యతిరేకంగా పార్టీలో మరొక గ్రూపు బయలుదేరింది. దీంతో జేసీ బ్రదర్స్ బండారు శ్రావణికి అనుకూలంగా వ్యూహాలు రచిస్తున్నారు. దీనిపై పార్టీ అధినాయకత్వం ఆలోచన మరోలా ఉంది. గతంలో తెలుగుదేశం పార్టీ నుంచి యామినిబాల, కాంగ్రెస్ నుంచి శమంతకమణి ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా పనిచేశారు. కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరిన శమంతకమణికి అప్పట్లో చంద్రబాబు ఎమ్మెల్సీ పదవి కూడా ఇచ్చారు. అయితే ఆమె వైసీపీలో చేరిపోయారు. దీంతో ఇక్కడ కొత్త నేత కోసం అన్వేషణ జరుగుతుంది. ఎక్కువ మంది జేసీ వర్గానికి చెందిన బండారు శ్రావణిని వ్యతిరేకిస్తుండటంతో చంద్రబాబు కొత్తనేతకు అవకాశమిస్తారంటున్నారు. అదే జరిగితే జేసీ వర్గానికి బలమైన దెబ్బేనని చెప్పాలి



# రాష్ట్రాభివృద్ధి,ఆర్థిక స్థితి పై అధికార ప్రతిపక్ష పార్టీలు దృష్టి పెట్టాలి: పురంధరేశ్వరి



విజయవాడ అక్టోబర్ 26 ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని చంద్రబాబు కోరడం టీడీపీ గుర్తింపు రద్దు చేయాలని ఈసీని వైసీపీ కోరడం సరికాదని బీజేపీ నాయకురాలు కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. రాష్ట్రాభివృద్ధి పై ఆర్థిక స్థితి పై దృష్టి పెట్టాల్సిన అధికార ప్రతిపక్ష పార్టీలు...ఇలా వ్యక్తిగత కక్షలతో దూషణలకు దిగడం ఫిర్యాదులు చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.వైసీపీ టీడీపీలు రాష్ట్రాభివృద్ధిని విస్మరించాయని ఆమె విమర్శించారు.కొంతకాలంగా ఇరు తెలుగు రాష్ట్రాల్లో పలు అంశాలపై రాజకీయ దుమారం రేగుతోన్న సంగతి తెలిసిందే. ఏపీలో సీఎం జగన్ వైసీపీ నేతలను టీడీపీ నేత పట్టాభి దూషించడం అనంతరం టీడీపీ కార్యాలయాల పై దాడుల వ్యవహారం ప్రకంపనలు రేపింది. టీడీపీ కార్యాలయాల పై దాడుల నేపథ్యంలో రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కు చంద్రబాబు ఫిర్యాదు చేశారు. మరో వైపు బద్వేలు హుజురాబాద్ ఉప ఎన్నికల తేదీ కూడా దగ్గరపడుతుండడంతో పార్టీలన్నీ విమర్శలు గుప్పించుకోవడంలో బిజీగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. బద్వేల్ లో వైసీపీకి బీజేపీ గట్టిపోటీనిస్తుందని తమ పార్టీని ప్రజలు ఆశీర్వదిస్తారని పురంధరేశ్వరి అన్నారు. హుజూరాబాద్ లో బీజేపీ విజయం పై నమ్మకముందని చెప్పారు. బీజేపీ నేల విడిచి సాము చేయదని తమ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా రాష్ట్రాభివృద్ధే తమ లక్ష్యమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి పాలన విధించాలా లేదా అన్నది రాష్ట్రపతి పరిధిలోని అంశమని అన్నారు.

# వలస పక్షులు వచ్చేశాయ్

నెల్లూరు, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి అతిథులు వచ్చేశాయ్. ప్రస్తుతం వందల సంఖ్యలో వలస విహంగాలు ఇక్కడ విడిది చేస్తున్నాయి. విదేశీ వలస పక్షుల్లో రారాజుగా ప్రసిద్ధి చెందిన గూడబాతులు (పెలికాన్స్) గత మూడు రోజులుగా సందడి చేస్తున్నాయి. కేంద్రంలో ప్రస్తుతం 200కి పైగా గూడబాతులు విడిది చేస్తున్నట్లు వన్యప్రాణి విభాగం సిబ్బంది తెలిపారు. వీటితోపాటు సీజన్‌కు ముందే ఇక్కడకు విచ్చేసిన నత్తగుల్ల కొంగలు (ఓపెన్ బిల్‌స్టార్క్స్) 500, తెల్లకంకణాయిలు (వైట్‌ఐబీస్) 200, పెద్ద నీటికాకులు (కార్మోరెంట్స్) 100కి పైగా విడిది చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా తెడ్డుముక్కు కొంగలు, నారాయణ పక్షులు, పాముమెడ కొంగలు వంటి పక్షులు రావాల్సి ఉంది. అయితే.. ప్రసిద్ధి చెందిన గూడబాతులకు స్థానికంగా వాతావరణం అనుకూలించకపోతే మాత్రం అవి వెనుతిరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకు కురిసిన వానలకు అత్తిగుంట, నేరేడుగుంట, మారేడుగుంట చెరువుల్లోకి అరకొరగా మాత్రమే నీళ్లు చేరుకున్నాయి. విడిది కోసం వచ్చిన విహంగాలు అడుగంటిన నీళ్లలోనే జలకాలాడుతూ సంచరిస్తున్నాయి. పుష్కలంగా వర్షాలు కురిసి చెరువుల్లో పూర్తి స్థాయిలో నీళ్లు ఉంటే ఇప్పటికే వేల సంఖ్యలో వలస విహంగాలు ఇక్కడ విడిది చేస్తూ ఉండేవి.

# బొగ్గు కొరత అవాస్తవం

విశాఖపట్నంఅక్టోబరు 26, (న్యూస్ పల్స్)నిత్యావసర ధరలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పెట్రోల్ ధరల మండిపాటుకి ప్రజలు రగిలిపోతున్నారు. 200రూపాయలకు చేరువ అవుతున్న పెట్రో ధర. 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రతిఘటన చేయనున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. మంగళవారం నాడు అయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు సొంత లబ్ది కోసం పాటుపడుతున్నారు...ప్రజాసమస్యలను మరిచారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, ప్లాంట్ ప్రయివేటీకరణ పై రెండు ప్రధాన పార్టీలు కలసి పోరాడాలి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికై కేంద్రం కేవలం 20వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంటున్న సమయంలో అధికార ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని నిలదీయడం పోయి తిట్ల రాజకీయాలు చేసుకోవడం దురదృష్టకరం. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రనీ పేరుగాంచింది,ఇది సిగ్గుచేటని అన్నారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులరజేషన్ ని కేంద్రం గుప్పెట్లో పెట్టుకునేందుకు చూస్తుంది. కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేసేందుకు చూస్తున్న కేంద్ర ప్రభుత్వ దురాలోచనలను తిప్పికొడతాం. బొగ్గు కొరత అనే ప్రచారం పూర్తి అవాస్తవం. కొంతమంది స్వార్ధపూరిత ధనలాభం కోసం కేంద్రం సృష్టించిన అసత్య ప్రచారం బొగ్గుకొరత అని అన్నారు.

# దివ్యాంగులలో వృత్తి నైపుణ్యం

విశాఖపట్నం దివ్యాంగుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ అందిస్తున్న కృషి మంచి ఫలితాలను అందిస్తోంది. ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా వారిలో వృత్తి నైపుణ్యాన్ని అందించి ఉపాది వైపు బాటలు వేస్తూ అందడగా నిలుస్తోంది.ప్రతీ ఏటా దిపావళి సందర్భంగా దివ్యాంగుల చేత ప్రమిదలను తయారు చెయ్యించి విక్రయించే కార్యక్రమాలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు.

విశాఖలో ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు.దీంట్లో బాగంగా ఈ ఏటా కూడా దివ్యంగులకు ప్రత్యేకంగా శిక్షణ అందించి వారిచే ఉత్పత్తులను అందించి సమాజంలో వారి పాత్రను చాటి చెబుతున్నారు.2009లో స్థాపించిన ఈ సొసైటీ ద్వారా దివ్యాంగులకు బాసటగా నిలుస్తున్నామని సోసైటీ ఫౌండర్ సుచిత్ర తెలిపారు.తయారు చేసే ఉత్పత్తులను పలు సంస్దలు విక్రయించి వారి సాయాన్ని కూడా సోసైటీ ద్వారా దివ్యాంగులకు అందిస్తున్నారని తెలిపారు

# జిల్లాల టూర్ కు జనసేనాని

ఏలూరు, అక్టోబరు 26, (న్యూస్ పల్స్)పవన్ డైలాగ్స్ తో అభిమానులంతా చప్పట్లు.. కేరింతలతో ఆదరించారు. ఈ సినిమాలో కన్పించినట్లుగానే పవర్ స్టార్ రాజకీయాల్లోనూ దూకుడుగానే వెళుతున్నారు. సినిమాల్లో బీజీగా ఉంటూ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన దారుణ పరాభవం నుంచి గుణపాఠాలు నేర్చుకొని పార్టీని తనదైన శైలిలో ముందుకు తీసుకెళుతుండటం ఆసక్తిని రేపుతోంది.జనసేన పార్టీ స్థాపించి దాదాపు ఏడేనిమిదేళ్లు కావొస్తోంది. పార్టీ స్థాపించిన తొలినాళ్లలో టీడీపీ కూటమికి జనసేనాని మద్దతు ఇచ్చారు. ఆ ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే కొంతకాలానికే వీరిమధ్య బంధం బీటలువారడంతో కిందటి ఎన్నికల్లో జనసేనాని టీడీపీని దూరం పెట్టారు. తమతో కలిసిన వచ్చిన వామపక్ష పార్టీలతో జనసేనాని పొత్తు పెట్టుకొని కిందటి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే అనుకున్న ఫలితాలు మాత్రం రాలేదు. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో పవన్ కళ్యాణ్ పార్టీని నడిపస్తున్న తీరు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.పవన్ కళ్యాణ్ పార్ట్ టైం పొలిటిషన్ అంటూ ప్రత్యర్థి పార్టీలు చేసే విమర్శలను సైతం జనసేనాని తనదైన శైలిలో తిప్పికొట్టారు. అలాంటి వ్యాఖ్యలు మళ్లీ చేయకుండా గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. ప్రజలు సైతం జనసేనానికి మద్దతుగా ఉంటుండటంతో ఆయన ఓవైపు సినిమాలు చేస్తూ ప్రజాసేవను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ చేయలేని ఎన్నో పనులను జనసేన పార్టీ ఒంటిచేత్తో చేస్తూ ముందుకెళుతోంది. దీంతో రాజకీయంగానూ జనసేనాని ఇమేజ్ క్రమంగా పెరుగుతూ పోతుంది. కిందటి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ, టీడీపీలకు ధీటుగా జనసేన ఓటింగ్ శాతం దక్కించుకుంది. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీలను రాజకీయంగా ఎదుర్కొంటూ స్థానిక సంస్థల్లో కొన్ని సీట్లను దక్కించుకుని సత్తాచాటింది. అదేవిధంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ జనాల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల పవన్ కల్యాణ్ చేపట్టిన రోడ్ల ఉద్యమానికి ప్రజలను నుంచి భారీ మద్దతు లభించింది. దీంతో ఏపీలో వైసీపీ, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా జనసేన మారుతోంది.ఈ అవకాశాన్ని జనసేన తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేలా భారీ ప్లాన్ రెడీ చేస్తోంది. దీనిలో భాగంగానే జనసేనాని త్వరలోనే జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందుకు సంబంధించిన రూట్ మ్యాప్ కూడా ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో జిల్లాల వారీగా సమస్యలను తెలుసుకోవడంతోపాటు పార్టీ స్థితిగతులను తెలుసుకునే ప్రయత్నం పవన్ కల్యాణ్ చేయబోతున్నారని టాక్. ఈమేరకు జనసైనికులు సైతం ఆయా జిల్లాల వారీగా జనసేనాని పర్యటన కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మొత్తానికి జనసేనాని జనంలో ఉండేందుకు ప్లాన్ చేసుకోవడంతో ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.

# కార్పొరేషన్ ఎన్నికలలో జనసేన పార్టీ నుండి

**మొత్తం 54 డివిజన్లలో పోటీ చేయడానికి సిద్దం**

**చెన్నారెడ్డి మనుక్రాంత్ రెడ్డి వెల్లడి**

నెల్లూరు నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలు రాబోతున్న సందర్భంగా జిల్లా జనసేన పార్టీ ఇంచార్జి మనుక్రాంత్ పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాతి జిల్లా ఇంచార్జ్ మనుక్రాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు,అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నార అని పేర్కొన్నారు.కరెంటు చార్జీలు,డీజల్,పెట్రోల్,గ్యాస్ రేట్లు పెరిగిపోయాయి అని ఆవేదన వ్యక్తపరిచారు. రోడ్ల దుస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేవు,యువకులకు ఉపాధి అవకాశాలు లేవని స్పష్టంగా తెలుస్తుందన్నారు. నెల్లూరు జిల్లాలో అయితే ఇంటి పన్ను,నీళ్ల పన్ను,చెత్త పన్ను అని ప్రజల నుండి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు .జనసేన పార్టీ ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ ఉంటుందన్నారు. సెప్టెంబర్ 2,3,4 వ తేదీన రోడ్ల దుస్థితి గురించి ఎన్నో కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు . రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ కి ప్రజల కష్టాలు కనిపించడం లేదన్నారు. వీటన్నింటిని గమనించిన ప్రజలు రాబోయే నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని తన అభిప్రాయం వ్యక్తపరిచారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అన్నీ చోట్ల పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు .కచ్చితంగా ఎక్కువ సీట్లు గెలవబోతున్నాం అని భరోసా ఇచ్చారు. ఎందుకంటే ఎంతోమంది ప్రజలు జనసేన పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు అని తెలిపారు .పవన్ కళ్యాణ్ దగ్గరకు వెళ్తే..ఏ సమస్య అయినా తీరుతుంది అనే నమ్మకం ప్రజల్లో గట్టిగా ఏర్పడిందన్నారు .జనసేన పార్టీ 2024 లో కచ్చితంగా అధికారంలోకి వస్తుందనే నమ్మకం ఉందన్నారు. ఎంతో మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. జనసేన పార్టీ నెల్లూరు శ్రీకి ఏం చేయబోతున్నామో చెప్పి , ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రజలకు వివరంగా చెప్పి ప్రజల మనసులను గెలుస్తాం..నిస్వార్థంగా, నిజాయితీగా పనిచేసే ఏకైక పార్టీ జనసేన పార్టీ..భారీ స్థాయిలో విస్తృతంగా ప్రచారం కూడా మొదలపెట్టాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కౌతాళం మండలం ఎరిగేరి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**గ్రామంలో ఉన్న నీరు ప్రభుత్వ ఉద్యోగులు తాగితే తెలుస్తుంది**

**స్వేచ్ఛ గ్రామాలు పేరుకే..**

కౌతాళంఅక్టోబరు 26, (న్యూస్ పల్స్) గ్రామాల్లో మంచినీటి సరఫరా చేయడంలో ప్రభుత్వ అధికారులు విఫలమైందని పేరుకే స్వేచ్ఛ గ్రామాలు ఫోటోలకే పరిమితం అయిందని గ్రామాల్లో కాలనీల్లో ఎక్కడా చూసిన కంపు కోడుతున్నాయని వ్యవసాయ రంగం ఉపాధ్యక్షుడు మల్లయ్య ఆరోపించారు. కౌతాళం మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎం పి డి ఓ కు మెమోరండం ఇవ్వడమైనది. ఎంపీడీవో మాట్లాడుతూ సాయంత్రం లేదా రేపు మీ ఊరుకి ఖచ్చితంగా తాగునీరు సప్లై చేస్తామని హామీ ఇవ్వడం అయినది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ మా గ్రామానికి వారం ,పది రోజులు అవుతుంది తాగునీరు రావడం లేదు. అధికారులకు తెలిపిన ప్రయోజనం లేదని మా గ్రామానికి హనువల్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీళ్లు సప్లై చేస్తున్నారు. గ్రామంలో పైపులైను మురికి కాలువలో, గుంతలలో పైప్ లైన్ వేయడం వల్ల నీళ్లు గలీజ్ గా , ఓూడు గా , మట్టి మట్టి గా నీళ్లు వస్తున్నాయని గ్రామంలో ఆ నీళ్లు తాగడం వల్ల పది ,పదిహేను మంది కిడ్నీలు పా డైపోయినాయయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం కిడ్నీ బాధితులు గ్రామాల్లో ఉన్నారని. ఆ నీళ్లు తాగడం వల్ల రోగాలకు గురి అవుతున్నారు. విష జ్వరాలు, మలేరియా, డింగి జ్వరాలతో బాధపడుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పెద్ద తుంబలం నుంచి ఫిల్టర్ నీళ్లు తెప్పించుకుని తాగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కావున అధికారులు వెంటనే స్పందించి మా గ్రామానికి తాగునీరు సప్లై చేసి, డ్రైనేజీలో ఉన్న పైప్లైను మార్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, లేని పక్షమున అధికారులను, నాయకులను నిలదీసి గ్రామ ప్రజలు అందరు కలిసి రోడ్ల దిగ్బంధనం చేయగలమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువ నాయకులు అంజి, శ్రీరాములు, శేఖర్, నారాయణ డివైఎఫ్ఐ కార్యకర్తలు విజయ్, సాల్మన్ రాజు ,రామాంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సింగరేణి నిర్మాణంలో అందరు భాగస్వాములు కావాలి

**ఆర్కే 6 గని మేనేజర్ సంతోష్ కుమార్**

మందమర్రి. అక్టోబర్ 26 అవినీతి రహిత సింగరేణి నిర్మాణంలో ఉద్యోగులు అందరు భాగస్వాములు కావాలని ఆర్కే 6 గని మేనేజర్ సంతోష్ కుమార్ పేర్కొన్నారు.సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ లో మంగళవారం నుండి వారం రోజుల పాటు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్ కె 6 గని పై మేనేజర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశం సమగ్రతతో కూడిన స్వలంబన అన్నది విజిలెన్స్ యొక్క నినాదం అని అన్నారు.కార్యలయల్లో, పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు చిత్తశుద్ధి, నిజాయితీతో పనిచేయలని సూచించారు.దాని ద్వారానే స్వావలంబన, స్వయం సమృద్ధి సాధించవచ్చు అని తెలియజేశారు.అవినీతీ పై జరిగే పోరాటంలో ఉద్యోగులందరిని భాగస్వాములను చేయడమే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.ప్రతి ఉద్యోగి అవినీతి వలన దేశానికి,సంస్థకు జరిగే నష్టాన్ని గుర్తించి స్వార్థన్ని ఉదాశీనతను వీడి అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే అవినీతిని నిరోదించి అవినీతి రహిత సింగరేణిని నిర్మించుకోగలమని ఆయన ఉద్యోగులకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

# శ్రీరామ్ నగర్ లో మంత్రి వనిత పర్యటన

కొవ్వూరు అక్టోబరు 26, (న్యూస్ పల్స్) కొవ్వూరు 1వ వార్డులో శ్రీరామ్ కాలనీలో జ్వరాలతో బాధపడు తున్న బాధితులను పరామర్శించి మెరుగైయిన వైద్య సేవలు అందిం చే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించడం జరిగిందని రాష్ట్ర స్త్రీ శిశు సం క్షేమ శాఖ మంత్రి డా.తానేటి వనిత పేర్కొన్నారు.మంగళవారం మంత్రి శ్రీరామ్ కాలనీ లో బాధితులను పరామర్శిం చి, అనంతరం ప్రభుత్వానికి ఆసుప త్రిలో చికిత్స పొందుతున్న భాదితులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ, శ్రీరామ్ కాలనీలో కొందరు జ్వరాలతో, తీవ్ర కాళ్ళ నొప్పుల ( జాయింట్ పేయిన్స్ ) సమస్య తో బాధపడుతున్నట్లు తన దృష్టికి వొచ్చిన వెంటనే సీఎం వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొనవలసిఉన్నా హుటాహుటిన ఇక్కడి కి వొచ్చి బాధితులను పరామర్శించి భరోసా కల్పించామన్నారు. బాధితుల తో స్వయంగా మాట్లాడామని, రాత్రి నుంచి కొందరి కి తీవ్ర జ్వరం వొచ్చి, తరువాత తీవ్రంగా జాయింట్ నొప్పులు, కళ్ళు తిరగడం వంటి లక్షణాలు వున్నట్లు పేర్కొన్నారన్నా రు. డాక్టర్ లతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు.అసలు జ్వరానికి కారణం విశ్లేషణ చేస్తున్నామని మాములు జ్వరాల, డెంగ్యూ నా, మలేరియా నా అనేదానిపై దృష్టి పెట్టామని తెలిపారు.

# రేషన్ డీలర్ల ఆందోళన

విజయవాడ అక్టోబరు 26, (న్యూస్ పల్స్)పౌర సరఫరాల శాఖ గోడౌన్ వద్ద రేషన్ డీలర్లు ఆందోళనకు దిగారు. డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకట్రావు మాట్లాడుతూ జిఒ నెంబర్ 10 రద్దు చేయాలి. వైయస్ హయాం నుండే గన్నీ సంచులు డీలర్ల కి ఇచ్చారు. అప్పటి నుండి కమిషన్ తో పాటు గన్నీ బ్యాగ్ లు డీలర్లు అమ్ముకుంటారు. బ్యాగుల కొరత పేరుతో ప్రభుత్వమే తీసుకుని ఒక్కో సంచికి 20 రూపాయలు ఇస్తామన్నారు. ఇప్పుడు అధికారులు గన్నీ బ్యాగ్ లకు డబ్బులు ఇవ్వడం సాధ్యం కాదంటున్నారు. దీని వల్ల డీలర్లు ఆర్థికంగా మరింత నష్టపోతారు. నిర్వహణ ఖర్చులు కూడా రాకపోతే ఎలా నడపాలి. వేలకు వేలు జీతాలు తీసుకునే అధికారులు అన్యాయంగా నిర్ణయాలు చేస్తున్నారు. పది నుంచి పదిహేను వేల ఆదాయంలో సగం కోత వేస్తున్నారు. ఇలాగైతే మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. దశాబ్దాల తరబడి ఎండీఎం, ఐసీడీఎస్ బకాయిలు కూడా పెండింగ్లో ఉన్నాయి.సిఎం జగన్మోహన్ రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌజ్

కర్నూలు అక్టోబరు 26, (న్యూస్ పల్స్)పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతీ ఏటా అమరవీరుల పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు రేంజ్ డిఐజి పి. వెంకటరామిరెడ్డి, కర్నూలు జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ఓపెన్ హౌస్ కార్యక్రంలో భాగంగా ప్రదర్శనలో ఉంచారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం ఈ రోజు, రేపు(బుధవారం) ఒపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు వ్యవస్థ పనితీరు గురించి , పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాల గురించి కళాశాల, పాఠశాల విద్యార్ధిని, విద్యార్ధులు తెలుసుకోవాలన్నారు. పోలీసు శాఖలో చేరే విధంగా ఈ కార్యక్రమం ద్వారా యువతలో ఉత్సాహాన్ని కల్పిస్తున్నామన్నారు. విచ్చేసిన విద్యార్ధులకు ఆయుధాల గురించి ఎఆర్ డిఎస్పీ ఇలియాజ్ భాషా అవగాహన చేశారు. ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పని తీరు గురించి అవగాహన కల్పించారు.

ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు....

బాడీవోన్ కెమరాలు, డ్రోన్ కెమేరాలు, డాగ్ స్క్వాడ్ బృందాలు, బాంబు డిస్పోజల్ టీం , మ్యాన్ ప్యాక్స్, బెస్ సెట్స్, బాడీ ప్రొటెక్టర్ , బి.పి జాకెట్, ఫైబర్ లాఠీ, స్టోన్ గార్డు, హెల్మెట్ , బుల్లెట్ ప్రూఫ్ జాకెట్, 1.5 ఫెడరల్ గ్యాస్ గన్, 303 రైఫిల్ , టియర్ స్మోక్ గ్రానైడ్, విల్ పిస్టల్, 9 ఎం.ఎం ఫిస్టోల్, 9 ఎం.ఎం గ్లాక్ పిస్టల్, 380 రివాల్వర్, 9 ఎం.ఎం. కార్బైన్ , 303 జి.ఎఫ్ రైఫిల్, 303 ఎల్ ఎమ్ జి,యుబిజిఎల్, ఏ.కే 47 రైఫిల్, 5.56 ఇన్సాస్ రైఫిల్, 12 బోర్ పంప్ యాక్షన్ గన్, 7.62 ఎమ్ ఎమ్ ఎస్ ఎల్ ఆర్, 410 మస్కెట్ ,.22 రైఫిల్, హ్యాండ్ హెల్డ్, మెటల్ డిటెక్టర్, రాకర్, డ్రాగన్ లైట్, ఎక్స్ ప్లోజివ్ డిటెక్టర్ , ఎన్ ఎల్ జెడి, సెల్ జామర్, ఎక్స్ టెన్షన్ మిర్రర్, వెహికల్ ఇన్ స్పెక్షన్ మిర్రర్, బాంబ్ బ్లాంకెట్ తదితర ఆయుధాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ తుహిన్ సిన్హా , స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీలు మహేశ్వరరెడ్డి, వెంకటాద్రి, కెవి మహేష్, మహబూబ్ భాషా, ఇలియాజ్ భాషా, డిఐజి గారి లైజనింగ్ ఆఫీసర్ సిఐ సునీల్ కుమార్, ఆర్ ఐలు సుధాకర్ , సురేంద్రారెడ్డి, రమణ ఆర్ ఎస్సైలు, ఎఆర్ పోలీసుసిబ్బంది, టౌన్ మోడల్ స్కూల్ , సిస్టర్ స్టానిస్లాస్ మెమోరియల్ ఇంగ్లీషు మిడియం హై స్కూల్, కెవియర్ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా పోలీసు నియమకాలపై హైకోర్టులో విచారణ

అమరావతి అక్టోబరు 26, (న్యూస్ పల్స్) గ్రామ సచివాలయాల్లో మహిళా కార్యదర్శులను పోలీసులు గా నియమించడంపై దాఖలైన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరపు న్యాయవాది యల మంజుల బాలాజీ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ, డీజీపీ, హోమ్ సెక్రటరీ, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్, ఏపీపీఎస్సీ చైర్మన్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రెవిన్యూ లో 15 వేల మందిని మహిళా కార్యదర్శులుగా నియమించి పోలీసు విధులు అప్పగించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విధులు మహిళా కార్యదర్శులకు ఎలా ఇస్తారో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. 1859 ఏపీ డిస్ట్రిక్ట్ పోలీస్ యాక్ట్ కు విరుద్ధం అన్న న్యాయవాది బాలాజీ వాదించారు. సివిల్ వివాదాలను పరిష్కరించవచ్చని పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేసారు. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు ఇది విరుద్ధం అన్న న్యాయవాది అన్నారు. వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ పరిశీలించిన తర్వాత మధ్యంతర ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం పేర్కోంది. గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు పోలీస్ యూనిఫార్మ్ ఇవ్వడం చట్టవ్యతిరేకం...1859 ఏపీ డిస్ట్రిక్ట్ పోలీస్ యాక్టుకు విరుద్ధమన్న పిటిషనర్ తరుపు న్యాయవాది విన్నవించారు. ఇలాంటి నిర్ణయాల వలన సమాజంలో పోలీస్ యూనిఫార్మ్ కు ఉన్నగౌరవం దెబ్బతిటుందన్న అయన అన్నారు.

# ప్రైవేటీకరణ విధానాలతో బిజేపీ పాలన

విశాఖపట్నం అక్టోబరు 26, (న్యూస్ పల్స్)రాష్ట్రాల ప్రయోజనాలను ఫణంగా పెట్టి, ప్రైవేటీకరణ విధానాలతో బిజెపి పరిపాలన సాగిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు అన్నారు.విశాఖలో మాట్లాడుతూ ఆకాలీదళ్, శివసేన, డీఎంకే పార్టీల తరహాలో ఏపీలో ప్రాంతీయ పార్టీలు బీజేపీ వ్యతిరేక విదానాలపై పోరాటం చేస్తేనే రాష్ట్ర ప్రయోజనాలు రక్షించబడతాయన్నారు.కేంద్రంలోని బిజెపి బ్రిటిష్ పాలకుల మాదిరిగా పన్ను భారాన్ని మోపుతున్న బీజేపీపై పోరాడకుండా... రాష్ట్రపతి పాలన పెట్టాలంటూ రాష్ట్రంపై కేంద్రానికి పెత్తనం ఇచ్చేందుకు ఇరు పార్టీలు పోటీపడుతున్నాయని మండిపడ్డారు.నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు ఎన్నడూ లేనివిధంగా పెరిగిపోయాయని ఈ ధరల పెరుగుదలకు నిరసంగా 28న వామపక్షాలు నిరసన కార్యక్రమం చేపట్టాయని, ప్రజలంతా పాల్గొనాలని మధు పిలుపునిచ్చారు.మోనిటైజేషన్ పేరుతో విశాఖ పోర్టుల్లో బెర్తులను, స్టీల్ ప్లాంట్ను, రైల్వేలు, ఎయిర్ పోర్టను ప్రైవేటీకరించినా ప్రధాన ప్రతిపక్షం ఎందుకు మాట్లాడటం లేదని మధు ప్రశ్నించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం అలుపెరుగని పోరాటం చేస్తున్నదని అన్నారు.

## కాలనీల్లో ఇబ్బందులు తలెత్తకుండా నీటి చర్యలు ముందస్తు జాగ్రత్తలు

### ఎన్నికల్లో మాట ఇచ్చాము మాట నెరవేరుస్తున్నాం మండల నాయకులు దేశాయ్ కృష్ణ

కౌతాళం అక్టోబరు 26,( విభారె) కాలనీల్లో నీటి సమస్య ఉండకూడదని ముందస్తు చర్యలు చేపట్టామాని ఎన్నికలల్లో మాట ఇచ్చాము అని మాట వేరవేరుస్తామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా నిర్వహిస్తామని వైసీపీ మండల నాయకులు దేశాయి కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం బైటి గెరి మరెమ్మ గుడి కాలనీల్లో వైఎస్ఆర్సీపీ నాయకుడు దేశాయి కృష్ణ మరియు సర్పంచ్ పాల్ దినకర్ కొత్త కొళాయిలు పైపులైన్లు వేయడం జరిగినది. మంగళవారం ఉదయం ప్రారంభోత్సవం జరిపినారు.వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న పథకాలు ఓర్చు కోలేక ఈ రోజు చంద్రబాబు రాజకీయ లబ్ధి పొందాలని నిరాహారదీక్ష లు చేయటం రాబోయే రోజుల్లో టీడీపీ కి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిక్కయ్య మరియు,ఎంపీటీసీ రాజహమద్ వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి హై స్కూల్ చైర్మన్ వద్దెరామన్నగారు మరియు వైసిపి నాయకులు సమద్ భాష మహానంది మరియు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాల సూపర్డెంట్ బాలయ్యని సస్పెండ్ చేయాలి

### సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

ఎమ్మిగనూరు అక్టోబరు 26,( విభారె) ఏమ్మిగనూరు పట్టణంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాల యందు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వ స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాల ఎంత మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైఫల్యం చెందుతున్నారు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బాలయ్యను తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా ఈ సందర్భంగా సిపిఐ తాలూకా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి తిమ్మగురుడు, సీపీఐ నాయకులు సత్యన్న వారు మాట్లాడుతూ వైద్యశాలలో సెప్టిక్ ట్యాంక్ నిండి రోడ్డుపై నీరు ప్రవహించే దుర్వాసన వెదజల్లుతోంది అని వైద్యం కోసం వచ్చిన వారికి త్రాగు త్రాగు నీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ట్యాంక్ క్లీన్ చేయాలని వంద పడకల వైద్యశాల నిర్మాణ దశలో ఉన్న ప్రాంతంలో నీటితో నిండి పోయిందని నీటిని బయటికి పంపాలి అని ప్రభుత్వ వైద్యశాలలో ఖాళీగా ఉన్న ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు భర్తీ చేయాలని వైద్యులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని గర్భిణీ స్త్రీల్లో ప్రైవేటు వైద్యశాలకు రెఫర్ చేయడం తగదని వైద్యశాలలో వ్యాపిస్తాయి పెంచాలని రక్త పరీక్షలు వైద్యశాల యందు నందు నిర్వహించాలని వారు తెలిపారు ఈ సందర్భంగా ఏంటి మురళి టీవీ డాక్టర్ చంద్రశేఖర్ ఏంటి డాక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో చిన్నన్న, హనుమంతు, కసి జబ్బార్ ,బాలరాజు ,రంగస్వామి ,విజయేంద్ర, కాజా, రామంజి, వీరేశ్ విజయ్, మల్లికార్జున గౌడ్ ,నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత హక్కులకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం

నంద్యాల అక్టోబరు 26,( విభారె) ప్రభుత్వ పరంగా మంజూరు చేసిన ఇళ్ళకు సంబంధించి లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నంద్యాల మున్సిపల్ పరిధిలో 22 వార్డులో గల శిల్ప నగరంలో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు . రెండు దశాబ్దాల కిందట నుంచి వివిధ ప్రభుత్వ పథకాల కింద గ్రుహలు పోందిన లబ్ధిదారులకు వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఇళ్ల ను లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయను న్నారు. దీనికి సంబంధించి సచివాలయం ఉద్యోగులు వాలంటీర్లు క్షేత్రస్థాయి లో సర్వే ప్రారంభించారు. 1983-నంచి 2011 వరకు గ్రుహనిర్మాణా పథకం లో లబ్ది పొందిన లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పిస్తారు. నంద్యాల నియోజకవర్గంలో గ్రుహ నిర్మాణ శాఖ ఆ జాబితాను ఇప్పటికే సచివాలయం సిబ్బంది కి అందజేసింది. వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల కు వెళ్లి వారు ఏ విభాగం కిందకు వస్తారో గుర్తిస్తారు. విఆర్ఓలు క్షేత్ర స్థాయిలో భౌతిక పరిస్థితిని సమీక్షిస్తారు. సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు కొలతలు హద్దులు నిర్ధారిస్తారు. ఆ వివరాలను డిజిటల్ అసిస్టెంట్లు అంతర్ జాలంలో నమోదు చేస్తారు. ప్రభుత్వం అందించిన మొత్తం యూనిట్ విలువలో లబ్ధిదారులకు కొంత మేర రుణంగా గతం లో అందించారు. రెండు దశాబ్దాలుగా వాటిని వసులు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. లబ్ధిదారులు గ్రహాలు నిర్మించుకున్నా రుణాలు చెల్లించని వారి పైనే దృష్టి సారించి వన్ టైమ్ సెటిల్ మెంట్ చేయాలని నిర్ణయించింది. లబ్ధిదారులను నాలుగు విభాగాలు విభజించారు పట్టా పొంది పది సంవత్సరాలు పూర్తి అయి ఉండాలి. 1) పట్టాదారుడు బుణం తీసుకుని నిర్మాణం చేసి ఉంటే (ఎ) గా గుర్తిస్తారు. ఇందులో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక్కో లబ్ధిదారుడు 10 వేలు. పట్టణ ప్రాంతానికి చెందిన వారు 15 వేలు. కార్పోరేషన్ వారు 20 వేలు చెల్లించాలి. (2)పట్టా భూమి కొనుగోలు చేసి నివసించే వారిని (బి) లో చేర్చారు. అనుభవ దారుడు గ్రామాల్లో అయితే 20 వేలు. పట్టణంలో అయితే 30 వేలు. కార్పోరేషన్ లో అయితే 40 వేలు చెల్లించాల్సి ఉంటుంది. (3) గతంలో పట్టాపొందిన వారసులు ఉంటే వారిని (సి) బాగంలో చేర్చారు. ఇలాంటి వారు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. (4) అభ్యంతర కరంగా కాని ఫోరం భోకు తదితర ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి వద్ద కూడా 15 వేలు వసూలు చేసి రెగ్యులర్ చేయనున్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నుండి 54 డివిజన్ లో పోటీకి సిద్ధం

### అవినీతి రహిత పాలనే ప్రధాన లక్ష్యం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంభంపాటి కృష్ణ

నెల్లూరు అక్టోబరు 26,( విభారె)నెల్లూరు నగరపాలక కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నుండి 54 డివిజన్లలో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంభంపాటి కృష్ణ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత పాలన తీసుకురావడమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ ముందుకెళ్తుందన్నారు. పార్టీ అధినేత కేజ్రీవాల్ సూచనలు సలహాల మేరకు అవినీతి నేను పాలన అందిస్తూ, అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా తమ వంతు విధులు నిర్వహించేందుకు ఆసక్తి గల యువతీయువకులు ఆమ్ ఆద్మీ పార్టీ నుండి కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయుటకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 2024లో లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాసనసభ స్థానాలు లోనూ , పార్లమెంటరీ స్థానాల్లోనూ పోటీ చేసేందుకు సంసిద్ధంగా అవుతుందన్నారు . ప్రస్తుత పరిస్థితులు విద్యాసంస్థల రీత్యా నూతన ఒరవడి తో కూడిన పరిపాలన అందించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చివరికి చేరుకున్న ప్రచారం

కడప, అక్టోబరు 26 కడప జిల్లా బద్వేల్ ఉప ఎన్నిక తుది అంకానికి చేరుకుంది. ఇవాళ్టితో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈసారి సైలెన్స్ సమయాన్ని 48గంటల నుంచి 72గంటలకు పెంచడంతో సాయంత్రం 5గంటలకే మైకులు మూగబోనున్నాయి. దీంతో అధికార వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఉప ఎన్నికలో వైసీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని బద్వేల్ ప్రజలకు సీఎం జగన్ బహిరంగ లేఖలు రాశారు. మరోవైపు బీజేపీ తరపున ప్రచారం చేసేందుకు అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. ఇక కాంగ్రెస్ కూడా గట్టిగానే ప్రచారం నిర్వహిస్తోంది.మొత్తం 272 పోలింగ్ కేంద్రాలు..బద్వేల్ వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ వెంకట సుబ్బయ్య ఆకస్మిక మరణంతో ఈ ఉప ఎన్నిక జరగనుంది. అధికార పార్టీ తరఫున వెంకట సుబ్బయ్య సతీమణి సుధ బరిలో నిలిచారు. ఇక బీజేపీ నుంచి పనతల సురేశ్ పోటీ చేయనుండగా, కాంగ్రెస్ తరఫున మాజీ ఎమ్మెల్యే కుతూహలమ్మ మరోసారి తన అదృష్టం పరీక్షించుకోనున్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నాయి. ఈనెల 30న పోలింగ్ జరగనుండగా. ..నవంబర్ 2న ఫలితాలు వెలువడనున్నాయి. ఇందుకోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.నియోజకవర్గంలోని ఓటర్ల పూర్తి వివరాలివేమొత్తం ఓటర్లు ? 2,16,139మహిళలు ? 1,07,340పురుషులు ? 1,08,799పోలింగ్ కేంద్రాలు ? 272సమస్యాత్మక కేంద్రాలు ? 3050శాతం కేంద్రాల్లో సీసీ కెమెరాలు, లైవ్ స్ట్రీమింగ్ ఉండనుంది.

## ఉచిత అన్నదాన కార్యక్రమానికి ఉచితంగా కూరగాయలు

### యల్ ప్రసాద్.

నంద్యాలఅక్టోబరు 26,( విభారె) 108దివ్య దేశాలలో ఒకటిగా శ్రీ అహోబిల క్షేత్రం విరాజిల్లుతుంది. అన్నం పరబ్రహ్మ స్వరూపం.. ఆకలి కొన్న వారికి అన్నం పెట్టే సంప్రదాయం మన పెద్దల కాలం నుంచి వస్తుంది.. అందులో భాగంగా స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యములో ఎగువ అహోబిలం లో కొత్తగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమానికి 46వ పీఠాధిపతి శ్రీ రంగ నాథ యతేంద్ర మహాదేషికన్ వారి ఆదేశాను సారం, నంద్యాలకు చెందిన ప్రముఖ కూరగాయల వ్యాపారి టి. రామన్న ఢసన్స్, కూరగాయాల కమీషన్ ఎజెంట్, అధినేత యల్ . ప్రసాద్, అదిలక్ష్మమమ్మ దంపతులు ప్రతి నిత్యం జరిగే అన్నదాన కార్యక్రమానికి ఉచితంగా కూరగాయల వితరణ చేయుటకు స్వామి సమక్షంలో సమ్మతిని తెలియపరచినారు.

## గాలికి వదిలేసిన వన్నాడ తారు రోడ్డు నిర్మాణ పనులు

### చుట్టు ప్రక్కల గ్రామల ప్రజలే శ్రమదానం చేస్తున్న దృశ్యలు
### చోద్యం చూస్తూ పట్టించుకోని అధికారులు
### అరడగూడెం నుండి వన్నడ వరకు తారు రోడ్డు నిర్మించాలి
### గిరిజన సమాఖ్య


విశాఖపట్నం అక్టోబరు 26,( విభారె) విశాఖ ఆదివాసి ప్రాంతమైన పెదబయలు మండలం అరడగూడెం నుండి వన్నాడ వరకు భారత ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి నిధులతో పంచాయతీరాజ్ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా చేపడుతున్న ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన ప్యాకేజీ నెంబర్ ఏపీ 19 ఎల్ డబ్ల్యూ ఈ 203 అరడగూడెం నుండి వన్నాడ వరకు 2.60 కిలోమీటర్లు అంచనా విలువ 143 . 60 లక్షలు నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులు పని ప్రారంభం తేదీ:01-10-2020. నుండి తేదీ:30-09-2021 నా తారు రోడ్డు నిర్మాణ పనులు ముగించ వలసి ఉన్నప్పటికీ ముగింపు తేదీ అయిపోయిన కూడా నేటి వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు జాడ కనిపించడం లేదని ఇంతగా ఈ రోడ్డు నిర్మాణ పనుల కోసం ముగ్గురు కాంట్రాక్టులు చాలా చాలెంజ్గా తీసుకుని రోడ్డుకు మట్టి సర్దేసి తారు రోడ్డు నిర్మాణ పనులు గాలికి వదిలేశారని సుమారు రెండున్నర కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణ పనుల కోసం ఇంకెంత మంది కాంట్రాక్టులు మారుతారో తెలియని పరిస్థితిలో ప్రజలు ఉ న్నారని అన్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టి రోడ్డంతా కొట్టుకుపోవడం వల్ల ప్రతి రోజూ వందల మంది ప్రయాణికులందరూ నరక యాతన పడుతున్నారని రోడ్డు బాగు లేకపోవడంతో చాలామంది ప్రమాదాలు జరిగి మృత్యువాత చెందుతున్నరని దీనికి అధికారులు ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయిందని మారుమూల ఆదివాసీ ప్రాంతాలలో ఆదివాసులే శ్రమదానం చేసి రోడ్డు నిర్మాణ పనులు చేసుకుంటున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని తక్షణమే అరడగూడెం నుండి వన్నాడ తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## వరుడు నాగ చైతన్య కావాల్సింది కాని మిస్



నాగ శౌర్య హీరోగా రీతూ వర్మ హీరోయిన్ గా సౌజన్య దర్శకత్వంలో రూపొందిన 'వరుడు కావలెను' సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు థియేటర్ల ద్వారా రాబోతున్న ఈ సినిమా ను సితార ఎంటర్ టైన్ మెంట్స్ లో సూర్య దేవర నాగ వంశీ నిర్మించాడు. ఈమధ్య కాలంలో ఈ నిర్మాణ సంస్థ పేరు మరియు ఈ నిర్మాత పేరు చాలా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ హీరోగా భీమ్లా నాయక్ సినిమాను కూడా ఈయనే నిర్మిస్తున్న విషయం తెల్సిందే. కనుక సహజంగానే ఇండస్ట్రీ వర్గాల్లో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. లక్ష్మీ సౌజన్య ఈ సినిమా కథను 2017 లోనే నిర్మాత చినబాబుకు చెప్పడం జరిగిందట. ఆ సమయంలో నాగ చైతన్యతో ఈ సినిమాను చేయాలని భావించిందట.కథ అనుసారం హీరో చాలా డీసెంట్ గా.. చూడగానే వావ్ అనిపించే మ్యాన్లీ లుక్ లో ఉండాలని భావించిందట. అందుకే నాగ చైతన్యను తన మనసులో అనుకుందట. తాజా ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని చెప్పుకొచ్చింది. నాగ చైతన్య ను అనుకున్నప్పటికి కుదరలేదు. అదే సమయంలో నాకు నాగ శౌర్య కూడా మైండ్ లో ఉన్నాడు. చైతూ తర్వాత వెంటనే నాకు మైండ్ లోకి వచ్చిన నాగ శౌర్య తో ఈ సినిమాను చేసినట్లుగా చెప్పుకొచ్చింది. ఈ సినిమా కథ చెప్పిన సమయంలో చినబాబు గారు చాలా ఎగ్జైట్ అయ్యారు. తప్పకుండా చేద్దామంటూ హామీ ఇచ్చారు. నాకు ఇంత కంటే బెస్ట్ డెబ్యూ దొరకదు. ఖచ్చితంగా ఈ సినిమా తో నాకు మంచి పేరు వస్తుందనే నమ్మకంను వ్యక్తం చేసింది.ఈ సినిమా కేవలం ఫ్యామిలీ ఆడియన్స్ కు అని మాత్రమే కాదని.. యూత్ ఆడియన్స్ కూడా ఈ సినిమాను ఎంజాయ్ చేసే విధంగా ఉంటుంది అంటూ చెప్పుకొచ్చారు. సినిమా ట్రైలర్ చూసిన తర్వాత సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. హీరోయిన్ రీతూ వర్మ పాత్ర చాలా ఇంట్రెస్టింగ్ గా ఉ ంది. ఆమె ను చాలా కొత్తగా దర్శకురాలు చూపించడం జరిగింది. ఈ సినిమా పబ్లిసిటీని చాలా కొత్తగా చేస్తున్నారు. చిత్ర యూనిట్ సభ్యులు తాజాగా ఎవరో తెలియని వారి పెళ్లి వేడుకకు వెళ్లి అక్కడ హడావుడి చేశారు. పెళ్లి వేడుకకు వెళ్లి అక్కడ కొత్త జంటతో ఫొటోలు దిగి వారిని సర్ ప్రైజ్ చేశారు. అలా రెండు మూడు పెళ్లిలను వరుడు కావలెను చిత్ర యూనిట్ సభ్యులు కవర్ చేయడం జరిగింది. మొత్తానికి ఈ సినిమా తో నాగ శౌర్యకు మరో సక్సెస్ ఖాతాలో పడటం ఖాయం అన్నట్లుగా అంతా నమ్మకంతో ఉన్నారు.

## కీరవాణి తనయుడి 'భాగ్ సాలే' షూటింగ్ ప్రారంభం..!




ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు శ్రీసింహా కోడూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "భాగ్ సాలే". ఫిబ్రవరిలో అధికారికంగా ప్రకటించిన ఈ సినిమా షూటింగ్.. సోమవారం ఉదయం హైదరాబాద్ లోని రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచ్చాన్ చేయగా.. దర్శకుడు హరీష్ శంకర్ ఫస్ట్ షాట్ కు క్లాప్ కొట్టారు.'మత్తు వదలరా' 'తెల్లవారితే గురువారం' వంటి వైవిధ్యమైన చిత్రాల తర్వాత శ్రీ సింహ నటిస్తున్న మూడో చిత్రం "భాగ్ సాలే". అనౌన్స్ మెంట్ పోస్టర్ తోనే ఈ సినిమాపై ఆసక్తిని కలిగించారు. క్రైమ్ కామెడీ జానర్ లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై డి.సురేష్ బాబు సమర్పణలో బిగ్ బెన్ సినిమా - సినీ వ్యాలీ మూవీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.యష్ రంగినేని - శింగనమల కళ్యాణ్ లు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. అశ్వత్థామ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. "భాగ్ సాలే" చిత్రానికి కీరవాణి మరో తనయుడు కాలభైరవ సంగీతం సమకూరుస్తున్నారు. సుందర్ రామ్ కృష్ణన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. సత్య గిడుటూరి ఎడిటర్ గా వర్క్ చేస్తున్నారు. శృతి నూకల ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రంలో జాన్ విజయ్ - రాజీవ్ కనకాల - వెన్నెల కిషోర్ - నందినీరాయ్ - సుదర్శన్ - వంశీ నెక్కంటి - వైవా హర్ష - కిడ్ చక్రి - జయవాణి - బాష - యాదం రాజు తదితరులు నటిస్తున్నారు.ఇకపోతే శ్రీ సింహా హీరోగా నటిస్తున్నారు 'దొంగలున్నారు జాగ్రత్త' చిత్రాన్ని కూడా మరో నిర్మాతతో కలిసి డి. సురేష్ బాబు నిర్మిస్తున్నారు. సతీష్ త్రిపుర ఈ మూవీతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు.

## దేవరకొండ బ్రదర్ కోసం అల్లు అర్జున్..!

సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ సోదరుడు యువ హీరో ఆనంద్ దేవరకొండ నటించిన కొత్త సినిమా "పుష్పక విమానం". 'మిడిల్ క్లాస్ మెలోడీస్' వంటి సూపర్ హిట్ తర్వాత ఆనంద్ నుంచి వస్తున్న ఈ సినిమాపై అందరిలో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేస్తున్న ఈ మూవీ రిలీజ్ కు రెడీ అయింది. పాండమిక్ వల్ల రిలీజ్ కోసం వేచి చూసిన ఈ చిత్రాన్ని నవంబర్ 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ ముమ్మరం చేస్తున్న మేకర్స్ గ్రాండ్ గా "పుష్పక విమానం" ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ని ప్లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్ కు స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ చీఫ్ గెస్టుగా హాజరు కానున్నారు. అక్టోబర్ 30న జరగనున్న ఈ కార్యక్రమానికి విజయ్ దేవరకొండ కూడా అటెండ్ అవుతారు. బన్నీ - విజయ్ ఒకే వేదికను పంచుకునే ఈ వేడుక కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.కాగా "పుష్పక విమానం" సినిమాతో దామోదర అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. విజయ్ దేవరకొండ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని 'కింగ్ అఫ్ ది హిల్' ప్రొడక్షన్ మరియు టాంగా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. గోవర్ధన్ రావు దేవరకొండ - విజయ్ దషి - ప్రదీప్ ఎర్రబెల్లి దీనికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మధ్యతరగతి కుటుంబాలలో పెళ్లి చుట్టూ జరిగే పరిస్థితులతో ఈ కామెడీ డ్రామాని రెడీ చేశారు.ఇందులో ఆనంద్ ఒక గవర్నమెంట్ స్కూల్ టీచర్ గా కనిపించనున్నారు. గీత్ సైని - శాన్వి మేఘన ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు. సునీల్ - నరేష్ - హర్షవర్ధన్ - అజయ్ - సుదర్శన్ తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. రామ్ మిరియాల - సిద్దార్థ్ సదాశివుని - అమిత్ దాసాని ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. మార్క్ కె రాబిన్ నేపథ్య సంగీతం అందించారు. హెస్టిన్ జోస్ జోసెఫ్ సినిమాటోగ్రఫీ అందించగా.. నీల్ సెబాస్టియన్ ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేశారు. రవితేజ గిరిజాల ఎడిటర్ బాధ్యతలు నిర్వహించారు."పుష్పక విమానం" చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు - 'కళ్యాణం కమనీయం' పాట విశేష స్పందన తెచ్చుకున్నాయి. దేవరకొండ బ్రదర్ నుంచి మరికొన్ని రోజుల్లో థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



## పాక్ అభిమానికి షమీ స్ట్రాంగ్ వార్నింగ్..!



టీ20 ప్రపంచకప్-2021?లో టీమిండియా పాక్ చేతిలో ఘోర పరాభవాన్ని ఎదుర్కొన్న అనంతరం భారత పేసర్ మహ్మద్ షమీని టార్గెట్ చేస్తూ కొందరు దురభిమానులు సోషల్‌మీడియా వేదికగా మాటల దాడికి దిగిన సంగతి తెలిసిందే. పాక్ చేతిలో ఓటమికి షమీనే కారణమని, అతడు పాక్‌కు అమ్ముడుపోయాడని, షమిని పాక్‌కు తరిమికొట్టాలంటూ భారీ ఎత్తున ట్రోల్ చేస్తున్నారు. అయితే షమీకి ప్రస్తుత, మాజీ క్రికెటర్లు, రాజకీయ నాయకులు, టీమిండియా అభిమానులు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో షమీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. ఇందులో షమీ పాక్ అభిమానికి వార్నింగ్ ఇస్తూ కనిపిస్తాడు.వివరాల్లోకి వెళితే.. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో పాక్ చేతిలో టీమిండియా ఓటమి అనంతరం భారత ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తున్న సందర్భంగా ఓ పాక్ అభిమాని గ్యాలరీలో నుంచి టీమిండియా ఆటగాళ్లందరినీ ఉద్దేశించి పరుష పదజాలంతో దూషణ?కు దిగాడు. ఈ దూషణ పర్వాన్ని భారత ఆటగాళ్లంతా గమనించిప్పటికీ.. మౌనంగా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. అయితే ఆ మాటలు విన్న షమీ మాత్రం స్పందించాడు.సదరు పాక్ అభిమానిపైకి దూసుకెళ్లి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. ఇంతలోనే కెప్టెన్ ధోని షమీని సముదాయించి లోపలికి తీసుకెళ్లాడు. ఈ వీడియోను ఓ అభిమాని సోషల్‌మీడియాలో పోస్టు చేస్తూ దేశం పట్ల షమీకి ఉన్న అంకితభావం ఇదంటూ కామెంట్ చేశాడు. ప్రస్తుతం ఈ వీడియా వైరలవుతుంది. దీంతో షమీకి భారీ ఎత్తున నెటిజన్ల మద్దతు లభిస్తుంది.

## బ్యాటింగ్ సంచలనం రుతురాజ్‌కు బంపర్ ఆఫర్.. ఏకంగా

చెన్నై సూపర్‌కింగ్స్ స్టార్ ఓపెనర్, బ్యాటింగ్ యువ సంచలనం రుతురాజ్ గైక్వాడ్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. ఐపీఎల్-2021 సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకుని ఆరెంజ్ క్యాప్ అందుకున్న అతడికి మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ కీలక బాధ్యతలు అప్పజెప్పింది. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ నేపథ్యంలో 24 ఏళ్ల రుతురాజ్‌ను మహారాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా నియమించింది. కాగా ఈ దేశవాళీ టీ20 లీగ్ నవంబరు 4 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.ఇందులో భాగంగా ఎలైట్ గ్రూపు-ఏలో ఉన్న మహారాష్ట్ర లీగ్ స్టేజ్‌లో లక్నోలో మ్యాచ్‌లు ఆడనుంది. ఈ నేపథ్యంలో రుతురాజ్ జట్టును ముందుండి నడిపించనున్నాడు. ఇక నౌషద్ షేక్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిం చనున్నాడు. మరోవైపు.. ఐపీఎల్-2021 ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గాయపడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆటగాడు రాహుల్ త్రిపాఠి ఇంకా కోలుకోలేదు. దీంతో అతడు జట్టుకు దూరమయ్యాడు.ఈ విషయాల గురించి మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రియాజ్ బాగ్బన్ మాట్లాడుతూ... "రాహుల్ త్రిపాఠి, సిద్దేశ్ వీర్, రాజ్‌వర్ధన్ స్థానాలను స్వప్నిల్ గుగాలే, పవన్ షా, జగదీశ్ జోపేతో భర్తీ చేశాం.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190